తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# సామాన్యభక్తుల్లా... సౌకర్యాలపై ఇ.ఓ ఆకస్మిక తనిఖీలు



తిరుమల,ఆగస్ట్ 2ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం పలు రకాలుగా టిక్కెట్లు,టోకెన్లు కలిగిన భక్తులు తిరుమలకు నిర్ధేశిత సమయం ప్రకారమే క్యూలైన్లలోకి చేరుకోవాలని టిటిడి ఈఓ జె,శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కోరారు. పెద్దసంఖ్యలో ముందుగానే తిరుమలకు చేరుకుని వైకుంఠమ్ కంపార్టుమెంట్లలో ,ఆరుబయట వేచివుండి ఇబ్బందులు పడుతుంటంతో సౌకర్యాలపై ఆరా తీశారు. శుక్రవారం సాయంత్రం వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ లలో ఉన్న సదూపాయాలను తనిఖీ చేశారు. కంపార్టుమెంట్లలో ఉన్న ఉచిత టెలిఫోన్ సదుపాయం, ఎస్వీబిసి ప్రసారాలు, ఎన్ని గంటల సమయం పడుతుంది అనే వివరాలు పై క్షుణ్ణంగా పరిశీలన చేశారు.

## అవగాహనతో...
# ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం

**-సమన్వయంతో పనిచేస్తా -ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణాచారి**



తిరుపతిటౌన్, ఆగస్ట్ 2ప్రభాతవార్త: రోజురోజుకూ పెరుగుతున్న భక్తులు, నగర జనాభా తగ్గట్లు వాహనాల సంఖ్య రెట్టింప వడంతో ట్రాఫిక్ నియంత్రణ అవగాహనతో చేస్తామని తిరుపతి ట్రాఫిక్ నూతన డిఎస్పీ పి.రామకృష్ణమాచారి తెలిపారు. ఇందుకు క్రిందిస్థాయి పోలీసు అధికారులు, సిబ్బందితో కలసి సమన్వయంతో పనిచేస్తానని అన్నారు. తిరుపతిలో పలు హోదాల్లో విధులు నిర్వహించిన అనుభవం ఉండటం, నగరంపై కొంత అవగాహన కలిగి ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని చైతన్యం కలిగిస్తామన్నారు. వాహనదారులు నిర్దేశిత ప్రాంతాల్లోనే వాహనాలను పార్కుచేయాలని, రోడ్లను ఆక్రమించకుండా వ్యాపారాలు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపరాదని, పట్టుబడితేవారితల్లిదండ్రులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. తిరుపతిలో వాహనదారులకు, యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో ముఖ్యమైన ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేలా సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. గతంలో ఈయన అలిపిరి ,వెస్టు పోలీసుస్టేషన్, తిరుమల,గంగవరంలో ఎస్ఐగా, సిఐగా తిరుపతి ఎస్‌బి సిఐగా సమర్ధవంతంగా విధులు నిర్వహించారు. తిరుపతి ట్రాఫిక్ డిఎస్పీగా నియమితులైన రామకృష్ణ ఆచారి శుక్రవారం ఉదయం ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను స్టేషన్‌లో సిఐలు, ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన డిఎస్పీ జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, విమలకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో...
# 7 ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం

**-పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత- రూ.1,500 చెల్లిస్తే రూ.5 లక్షల ఆరోగ్య జీవిత బీమా సౌకర్యం- కలెక్టర్ సుమిత్‌కుమార్**

చిత్తూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త: పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పారిశుధ్య కార్మికులు సైతం తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పారిశుధ్య కార్మికుల కోసం నిర్వహించిన మెడికల్ క్యాంపును కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు బిపీ, షుగర్, గుండె, కన్ను, కిడ్నీ, వస్తమా వంటి వ్యాధులు వచ్చే అవకాశం వుందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి వైద్య నిపుణులతో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 7 ప్రైవేటు ఆసపత్రుల్లో పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్యం అందించడం జరుగుతున్నదన్నారు. అలాగే బ్యాంకుల ద్వారా ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించడం జరుగుతున్న దన్నారు. సంవత్సరానికి రూ.1,500 చెల్లిస్తే రూ.5 లక్షల ఆరోగ్య, జీవిత బీమా సౌకర్యం పొందవచ్చునన్నారు. కార్మికులకు యూనిఫాంలు, గ్లౌస్‌లు, మాస్క్‌లు, బూట్లు అందించడం జరుగుతుం దన్నారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో సైతం పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టిన విషయం మరువలేనిదన్నారు. అప్కాస్ ద్వారా విధులు నిర్వహిస్తున్న వారికి సక్రమంగా జీతభత్యాలు చెల్లింపు, ఇపిఎఫ్, ఇఎస్ఐ తదితరాలను పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించడం జరిగిందన్నారు. అలాగే కార్మికుల పిఎఫ్ సమస్యను పరిష్కరించడానికి మెప్మా పిడిని నోడల్ అధికారిగా నియమించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం పట్ల చిత్తశుద్ధితో వుందని, జిల్లా యంత్రాంగం తరపున ప్రతి మూడు నెలలకు ఒకసారి పారిశుధ్య కార్మికులకు ప్రముఖ వైద్య సంస్థలతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యంపై ఓ వైపు శ్రద్ధ వహించి మరోవైపు చిత్తూరు నగరంను పారిశుధ్యంగా వుంచి రాష్ట్ర స్థాయిలో చిత్తూరు అగ్రస్థానంలో నిలిపేలా విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పారిశుధ్య కార్మికులకు ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు అధికంగా వచ్చే అవకాశం వుండటంతో వారికి తగిన వైద్య పరీక్షలు నిర్వహించి నాణ్యమైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. మేయర్ అముద మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఒక్క రోజు విధులు నిర్వహించకుంటే నగరం అపరిశుభ్రం అవుతుందని, వారు ఆరోగ్యంగా వుండి విధులను పక్కాగా నిర్వర్తించి నగరంను పరిశుభ్రంగా వుంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ మేయర్ కఠారి హేమలత, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న కలెక్టర్

## టైమ్‌స్లాట్ భక్తులు...
# నిర్ధేశిత సమయానికే రావాలి

**-శ్రీవారి లడ్డూప్రసాదాల నాణ్యత,రుచి మరింత పెంచుతాం -"డయల్ యువర్ ఈఓ"లో శ్యామలరావు**

తిరుమల,ఆగస్ట్ 2ప్రభాతవార్తప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంలో అమలవుతున్న టైమ్‌స్లాట్ ఉచిత సర్వదర్శన టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశిత సమయానికి తిరుమలకు చేరుకుని దర్శనానికి వెళ్ళాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు కోరారు. దీనివల్ల కొన్నిగంటల్లోనే స్వామివారి దర్శనం చేసుకునే వీలుకలుగు తుందని, నిరీక్షణ సమయం తప్పుతుందన్నారు. దేవుని లడ్డూప్రసాదాల నాణ్యత,రుచి మరింతగా పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఉదయం అన్నమయ్యభవనంలో



"డయల్ యువర్ ఈఓ"కార్యక్రమంజరిగింది. ఈ కార్యక్రమానికి పలుప్రాంతాలనుండి భక్తులు ఫోన్‌ద్వారా తమ సమస్యలు, సూచనలు, సలహాలు, ఫిర్యాదులు చేశారు. టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, సిఇ నాగేశ్వరరావు, ఎస్వీబిసి సిఇఒ షణ్ముఖకుమార్, విజిలెన్స్ వింగ్ వివిఎస్ఓ ఎస్వీవి రామ్‌కుమార్, డిప్యూటీ ఈఓలు లోకనాథం, పి.హరీంద్ర నాథ్, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈఓశ్యామలరావు భక్తుల ప్రశ్నలకు సమాధానాలు, సలహాలకు అవసరమైన విధంగా స్పందించారు. తిరుపతినుండి అలేఖ్య మాట్లాడుతూ టిటిడి పుస్తక విక్రయశాలల్లో టిటిడి ప్రచురణలు అందుబాటులో ఉంచాలని కోరారు. దీనిపై ఈఓ స్పందిస్తూ తప్పకుండా తగిన విధంగా చూస్తామన్నారు. నెల్లూరునుండి మునిలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత తిరుమలలో ఈఓగా మీ పాలనలో మార్పులు తీసుకువచ్చారని, గతంలో పివిఆర్‌కె ప్రసాద్ ఈఓగా ఉన్నరోజులు గుర్తుకు వస్తున్నాయన్నారు. భక్తులకు సేవలందించడంలో ముందుంటామని, మరిన్ని సంస్కరణలు తీసుకువస్తామని ఈఓ తెలిపారు. నగరినుండి నాగరాజన్ మాట్లాడుతూ తిరుత్తణిలో టిటిడి స్థలం ఉందని, ఆక్రమణలకు లోనవుతోందని, కల్యాణమండపం నిర్మించాలని కోరారు. దీనిపై ఈఓ సమాధానంగా అధికారులు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి నుండి దేవానంద్ మాట్లాడుతూ 9నెలల క్రిందట టిటిడిలో ఏఈఈ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారని రాత పరీక్ష నిర్వహించలేదన్నారు. దీనిపై ఈఓ స్పందిస్తూ త్వరలో ఏఈఈ నియామకాలు పూర్తిచేస్తామన్నారు. సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్ కేంద్రభద్రత బలగాలకు సుపథం మార్గంద్వారా దర్శనం కల్పించాలని కోరారు. దీనిపై ఈఓ స్పందిస్తూ ఇప్పటికేఅవకాశంఉందని, మరోసారి పరిశీలించి సానుకూలంగా వ్యవహరిస్తామన్నారు. కడప నుండి భాస్కర్ మాట్లాడుతూ తిరుమలలో ఏప ప్రాంతాలకు ఉచిత బస్సులు తిరుగుతున్నాయి, శ్రీనివాసమంగాపురం నుండి శ్రీవారిమెట్టువరకు ఉచిత బస్సు ప్రయాణసమయాలు తెలియజేసే బోర్డులు ఏర్పాటుచేయాలని సూచించారు. దీనిపై ఇఒ స్పందిస్తూ పరిశీలించిన తగిన విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. తిరుమలలో గోకులంలో శ్రీవాణి 900 బ్రేక్ టిక్కెట్లు ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్నామన్నారు. తిరుమలలో తాగునీరు, అన్నప్రసాదాలు నాణ్యత ఎప్పటికప్పుడు పరీక్షించేందుకు ఎఫ్ఎస్ఎస్ఎఐ ఆధ్వర్యంలో ప్రయోగశాల ఏర్పాటుచేస్తున్నామన్నారు.భక్తులకు హోటళ్లలో నాణ్యతతో రుచికరంగా ఆహారం అందించే చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు...
# చట్ట రీత్యా నేరం : ఆర్‌డివో



గూడూరు, ఆగష్టు 2 ప్రభాత వార్త : గూడూరు ఆర్డివో కార్యాలయంలోని సమావేశ మందిరంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం అమ లుపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆర్డివో కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టమును పట్టిష్టంగా అమలు చేయాలని, వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమే అని ఆడపిల్లల పట్ల వివక్షత ఉండకూడదు అని తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంను కఠినంగా అమలు చేయడం ద్వారా భ్రూణ హత్యలను నివారించవచ్చని అన్నారు. జిల్లాలో ప్రతి నెల అన్ని స్కానింగ్ కేంద్రాలను డాక్టర్లు తనిఖీలు నిర్వహించాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడుతున్న స్కానింగ్ సెంటర్ల వారి రిజిస్ట్రేషన్ తొలగించడం జరుగుతుందని అన్నారు. స్కానింగ్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్, రెన్యువల్, ఇతర మోడీఫికేషన్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ మార్చాలన్నా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వారి అనుమతి తప్పనిసరిగా పొందాలని తెలిపారు. ఈ చట్టమును అతిక్రమించిన వారికి రూ. 50000 రూపాయలు జరీమానతో బాటు 3 సంవత్సరాల కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని సమాచారం తెలిసిన వారు 102, 104 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు. ప్రజలలో గర్భస్థ పిండలింగ నిర్ధారణ చట్టం పై అవగాహన పెంచేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ మస్తనమ్మ, డివిజనల్ పరిపాలన అధికారి శిరీష, డెమో బాబు, నెహ్రూ రెడ్డి, డిప్యూటీ సివిల్ సర్జన్ సంపూర్ణ, సివిల్ అసిస్టెంట్ సర్జన్ బి. గిరిజ, సిడిపివో మెహబూబి, గూడూరు రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపాలిటీ,,, ఎంపిపి స్థానాలే టార్గెట్ !**

## కుప్పంలో కంచర్ల...
# వ్యూహాత్మక అడుగులు

**చంద్రబాబు సూచనలతో వైఎస్సార్సీకి గట్టిషాక్ తగిలేలా ప్రయత్నాలు**



కుప్పం, ఆగస్టు 2 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబు నాయుడు సొంత నియోజక వర్గమైన కుప్పంలో ఎమ్మెల్సీ, సమన్వ యకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. కుప్పంలో వైఎస్సార్సీకి గట్టిషాక్ తగిలేలా ఆయన వ్యూహరచన చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. అందుకు సన్నద్ధమై కుప్పంలో అత్యంత కీలకమైన కుప్పం మున్సిపాలిటీ, నాలుగు మండలాల ఎంపిపి స్థానాలే టార్గెట్‌గా పెట్టుకుని కార్యాచరణ అమలు చేస్తున్నారు. మరో పక్క పార్టీని మరింత పటిష్టం చేసే దిశగా పావులు కదుపుతున్నారు. సిఎం చంద్రబాబునాయుడు గతేడాది ఎమ్మెల్సీ డా॥ కంచర్లపై పూర్తి విశ్వాసంతో పార్టీ పగ్గాలు అప్పగించారు. అందుకు తగిన రీతిలోనే ఆయన కుప్పంలో తెలుగుదేశం పార్టీ సంస్థాగత బలోపేతం, పార్టీ కార్యక్రమాలపై దృష్టి సారించారు. కుప్పంలోనే నివాసం ఉంటూ కార్యకర్తలకు అండగా నిలిచారు. ఎన్నికలకు ముందు అప్పుడు అధికారంలో ఉన్న వైకాపా శ్రేణులు బనాయించిన కేసులను కార్యకర్తలు తట్టుకునేలా వారికి ధైర్యం కల్పించడంతో పాటు మరలా తెలుగుదేశం పార్టీ అధికారంలో రావడం ఖాయమని భరోసా కల్పిస్తూ వారిలో ఉత్తేజాన్ని నింపారు. నాలుగు మండలాల పరిధిలో సీనియర్ల సలహాలు తీసుకుంటూ యువత,మహిళావిభాగం ప్రజల్లో తెలుగుదేశం పార్టీని విస్తృతంగా తీసుకువెళ్లేలా చేయడంలో సక్సెస్ సాధించారు. కుప్పంలో ఈసారి సిఎం చంద్రబాబునాయుడుకు గతం కంటే 18వేల ఓట్ల మెజార్టీ పెరిగింది.

**కుప్పం మున్సిపాలిటీ కైవశమే లక్ష్యమా :**

ఎక్కడైతే తెలుగుదేశం పార్టీకి, సిఎం చంద్రబాబుకు ఇబ్బందులు తలెత్తాయో అదే మున్సిపాలిటీని కైవశం చేసుకునేలా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ తన రాజకీయ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. 2021లో జరిగిన కుప్పం మున్సిపల్ ఎన్నికలు సిఎం చంద్రబాబు నాయుడును తీవ్రంగా కలచివేశాయి. ఆ ఎన్నికల్లో వైఎస్సార్సీ నేతలు మాజీ మంత్రి పెద్దిరెడ్డి అండదండలతో తెదేపా శ్రేణులను అన్ని విధాలా లాక్ చేయడం, భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు కేసులు నమోదు చేయించారు. అస్త్రశస్త్రాలు ప్రయోగించి మున్సిపాలిటీని 19 కౌన్సిలర్‌సీట్లతో దక్కించుకున్నారు. అప్పట్లోనే తెలుగుదేశం పార్టీ తరపున పోటీచేసిన 6మంది అభ్యర్థులు కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. మరో రెండు మూడు వార్డుల్లో వంద లోపు ఓట్లతో ఓడిపోయారు. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఘనవిజయం సాధించి అధికారంలో వచ్చింది. దీంతో ఇటీవలే మున్సిపల్ ఛైర్మన్, మరికొందరు కౌన్సిలర్లు తెదేపాలో చేరాలని భావించి ప్రయత్నాలు చేయగా అవి సఫలం కాలేదని సమాచారం. ఇదే తరుణంలో అధికారం తెదేపా కౌన్సిలర్ల చేతుల్లో వచ్చేలా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల ప్లాన్ వేశారని స్పష్టమవుతోంది. కుప్పం మున్సిపల్ పరిధిలో ఇదివరకే తెదేపాకు 6మంది కౌన్సిలర్లు ఉండగా తాజాగా సిఎం చంద్రబాబునాయుడు సమక్షంలో మరో 5మంది కౌన్సిలర్లు వైకాపాను వీడి తెదేపాలో చేరారు. దీంతో తెదేపా కౌన్సిలర్ల సంఖ్య మున్సిపాలిటీలో 11కు చేరింది. మరో ఇద్దరు, ముగ్గురు కౌన్సిలర్లు అధికార పార్టీతో టచ్‌లో ఉన్నారని సమాచారం. వీరు తెదేపాలో చేరితే దేశం కౌన్సిలర్ల సంఖ్య 13లేదా 14కు చేరుతుంది. ఈ లెక్కన చూస్తే తెలుగుదేశం పార్టీ మున్సిపాలిటీలో పట్టుసాధించి అధికారం చేజిక్కించు కున్నట్లే లెక్క. దీంతో వైకాపా తరపునుంచి ఎన్నికైన మిగతా కౌన్సిలర్లను పార్టీలోకి చేర్చుకుంటారా లేదా అనేది అధికార పార్టీకి 'ఛాయిస్' కానుంది. ఈ రీతిన ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ చేపట్టిన ఆపరేషన్ 'కుప్పం మున్సిపాలిటీ ' వందశాతం సక్సెస్ అయినట్లే. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీలో మెజార్టీ ఉన్న అధికార తెదేపా కౌన్సిలర్ల నిర్ణయాలే కీలకంగా మారి అమలయ్యే అవకాశాలు ఉన్నాయి. మరో పక్క నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న మరిన్ని ఎంపిపి స్థానాలు సైతం తెదేపా పరమయ్యేలా ఎంపిటిసిల ద్వారా ఎంపిపి స్థానాలు సైతం నాలుగు మండలాల్లో దక్కించుకునేలా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల వ్యూహరచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## చెంగల్వరాయస్వామి
# ధ్వజావరోహణం

**కుమారస్వామి కొండపై ముగిసిన ఉత్సవాలు**



శ్రీకాళహస్తిలో వల్లిదేవ సేన సమేత సుబ్రమణ్యం స్వామి ఊరేగింపు దృశ్యం



శ్రీకాళహస్తి,ఆగస్టు 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన చెంగల్వరాయస్వామి, అనుబంధ ఆలయం అయిన కుమారస్వామి కొండపై వారం రోజుల పాటు నిర్వహించిన కార్తికేయుని మహోత్సవాల ప్రధాన ఉత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. ఉదయం నుంచి ఆలయంలో స్థానిక ఆచార వ్యవహారాలతో ఉత్సవాలు నిర్వహించారు.అలంకార మండపంలో వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామిని చక్కగా ఆలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రఘుస్వామి,దఫేదార్ రాజాల పర్యవేక్షణలో గ్రామోత్సవం జరిగింది. అనంతరం స్వామి అమ్మవార్లను దిగువ సన్నిధి వీధిలోని వసంత మండపం వద్దకు చేర్చారు. వసంతోత్సవం నిర్వహించారు, ఈ సందర్భంగా మండపాన్ని చక్కగా ఆలంకరించారు. అక్కడ ఆలయ అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామినాధన్ గురుకుల్ వేదపండితులు అర్ధగిరి వేదమంత్రాల్ని పఠిస్తుండగా శాస్త్రోక్తంగా స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు షోడషాభిషేకాలు జరిపారు.అనంతరం ఉత్సవర్లను ఆలయంలోని చేర్చారు.

**ధ్వజావరోహణం:**

ఆడికృత్తిక మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయంలో శుక్రవారం రాత్రి ధ్వజావరోహణ కార్యక్రమాల్ని ఏర్పాటు చేశారు. అర్చకులు, రుత్వి కులు కలశాల్ని వేదమంత్రాలను వేదపండితులు పఠిస్తుండగా మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో ధ్వజావరోహణ కార్యక్రమాల్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఈ కార్యక్రమాల్లో డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి,ఆలయ ఇన్స్పెక్టర్లు సుధర్శనం నాయుడు, హరియాదవ్, ఎస్ఓ నాగభూషణం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**భక్తి శ్రద్ధలతో కలశోద్వాసన:**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న చెంగల్వరాయస్వామి మహోత్సవాల సందర్భంగా యాగశాలలో ఏర్పాటు చేసిన కలశాలను ఉద్వాసన కార్యక్రమా లను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఆ కలశాల్లోని నీటితో స్వామి అమ్మవార్లను అభిషేకించారు. ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదమంత్రాలను పఠిస్తుండగా ఆలయ డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి సారధ్యంలో ఆలయ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడు కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో అర్చకులు నిరంజన్ గురుకుల్,ఎస్ఎంకె గురుకుల్ అనే అచ్చితా గురుకుల్ ఎస్ఓ నాగభూషణం యాదవ్‌లు పాల్గొన్నారు.

**నేడు పల్లకి సేవ:**

ఆడికృత్తిక మహోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం భారీ ఎత్తున పల్లకి సేవను నిర్వహించనున్నారు. శనివారం అమావాస్య కావటంతో మూడు పల్లకిల్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయాధికారి తెలిపారు. స్వామి అమ్మవార్లు వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామికి ఓ పల్లకిని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పల్లకి సేవ రాత్రి 8గంటలకు ప్రారంభించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు.ఈ ఉత్సవంతో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ముగిసినట్లే.

## మండల తహశీల్దార్‌గా హనుమంత్ నాయక్

**చౌడేపల్లి, ఆగస్టు 2 ప్రభాతవార్త :** చౌడేపల్లి మండల తహశీల్దార్‌గా హనుమంత్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్నికల విధుల్లో భాగంగా ఇక్కడున్న శివరాముడు ఆదోనికి బదిలీ కాగా అనంతపురం జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తించిన హనుమంత్ నాయక్ చౌడేపల్లికి నియమితులయ్యారు. గతంలో ఈయన జిల్లాలో పెద్దపంజాని, యాదమర్రి మండలాల్లో పనిచేసారు.

## గడ్డంవారిపల్లి విఆర్‌ఓకు రివర్షన్

**చౌడేపల్లి, ఆగస్టు 2 ప్రభాతవార్త :** నిబంధనలను ఉల్లంఘించి ప్రభుత్వ భూమిని ఆక్రమించినందుకు మండలంలోని గడ్డంవారిపల్లి విఆర్‌ఓ వై.వెంకటమునికి విఆర్‌ఏగా రివర్షన్ ఇస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసారు. పుంగనూరు మండల పరిధిలో ప్రభుత్వ అసైన్డ్‌భూమిని విఆర్‌ఓ వెంకటముని తన అధికార దుర్వినియోగానికి పాల్పడి స్వంత కుటుంబ సభ్యుల పేరున పట్టా మంజూరు చేశారన్న ఫిర్యాదు రావడంతో మదనపల్లి సబ్‌కలెక్టర్ విచారణ చేపట్టారు. విచారణలో విధుల దుర్విని యోగం రుజువుకావడంతోవిఆర్‌ఓవెంకటముని విఆర్‌ఏగా రివర్షన్ ఇచ్చినట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## కారు డీకొని వృద్ధునికి తీవ్రగాయాలు



**గంగవరం, ఆగస్టు 2, ప్రభాతవార్త :** కారు డీకొని ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన శుక్రవారం మధ్యాహ్నం మండలంలో చోటు చేసుకంది. గంగవరం అర్బన్ సిఐ చిన్నగోవిందు కథనం మేరకు మండలంలోని మేలుమాయి గ్రామానికి చెందిన పెద్దబ్బ అలియాస్ మునిరత్నం(60) అనే వృద్ధుడు మేలుమాయి పంచాయతీ కొత్తూరు గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తమ గ్రామం నుండి టివిఎస్‌మోపెడ్ వాహనంలో పలమనేరు వారపు సంతకు వెళ్ళి నిత్యవసర సరుకులు తీసుకుని స్వగ్రామానికి వస్తుండగా పలమనేరు మదనపల్లె జాతీయ రహదారిపై మబ్బువాళ్ళపేట సమీపంలోకి రాగానే మదనపల్లె వైపు నుండి పలమనేరు వస్తున్న కారు వేగంగా వచ్చి డీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రథమ చికిత్స అనంతరం వృద్ధుని పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రూయాకు తరలించారు. సిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రామకుప్పం మండలంలో అవీ..ఇవీ



**రామకుప్పం, ఆగస్టు 2 ప్రభాతవార్త :** స్థానిక జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థినీ విద్యార్థులకు దేశం నేతలు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలకు నూతన భవనాలు, మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, కార్యదర్శి నరసింహులు, మాజీ ఎంపిపి ఆంజనేయరెడ్డి, నేతలు సీతాపతి, మునిరెడ్డి, రామలింగారెడ్డి, విశ్వనాథ్, సుబ్రి, మురళి, సురేష్, ప్రిన్సిపాల్ చాణక్యుడు, అధ్యాపకులు పాల్గొన్నారు. 2.మండలంలోని చెల్దిగానిప ల్లిలో తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ మధుసూధన్‌రెడ్డి ఆధునిక వ్యవసాయంపై రైతులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇజ్రాయిల్ టెక్నాలజీ, వ్యవసాయ ఉత్పత్తుల సాగు తదితరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మురళీకృష్ణ, విద్యార్థులు, రైతు పాల్గొన్నారు. విజలాపురం పిహెచ్‌సిలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. డా॥ పూజిత మాట్లాడుతూ తల్లిపాల ప్రాధాన్యత, రక్తహీనత గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ఎఎన్‌ఎం సుకన్య, బాలు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## పలమనేరు తహశీల్దార్‌గా ఇన్బనాథన్



**పలమనేరు, ఆగస్టు 2 ప్రభాతవార్త :** పలమనేరు తహశీల్దార్‌గా ఇన్బనాథన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఎన్నికలకు ముందు జిడి నెల్లూరు తహశీల్దార్‌గా పనిచేసి అనంతరం అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం పలమనేరు తహశీల్దారుగా నియమితులయ్యారు. ఈసందర్భంగా తహశీల్దార్ ఇన్బనాథన్‌ను డిటి రుషి వర్మ, ఆర్.ఐ. విఆర్వోలు ఘనస్వాగతం పలికారు. పలమనేరు తహశీల్దార్ రంగనాయకులు అనంతపురంజిల్లాకు బదిలీ అయ్యారు.

## సామాజిక ఫించన్‌ల పంపిణీ

**సత్యవేడు, ఆగస్టు 2 ప్రభాతవార్త:** మండలంలోని పిపిపురం యానాదికాలనీలో శుక్రువారం తెలుగుదేశం పార్టీ రాష్ట్రవాణిజ్య విభాగం ఉపాధ్యక్ష్యులుబాలరాజు స్థానిక నాయకులు, క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి సామాజిక ఫించన్‌లను పంపిణీ చేశారు. వృద్దులకు, మహిళలకు ఫెన్షన్ నగదును అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సువర్ణ పాలన కొనసాగుతుందన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధేధ్యేయంగా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నాడని అన్నారు. మునుపెన్నడూ లేని అభివృద్ధి సంక్షేమపాలన ప్రజలు చూడబోతున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ దామోదర్ రాజు, నందరాజు, నిర్మళమ్మలు పాల్గొన్నారు.

## సప్తమాతృకలతో దర్శనమిచ్చిన శ్రీచౌడేశ్వరీదేవి



**పుంగనూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త :** మండలంలోని చదళ్ళ గ్రామంలో వెలసిన శ్రీచౌడేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం ఘనంగా పూజలు జరిగాయి. పురాతన చరిత్ర కల ఈ ఆలయాన్ని దశాబ్దం క్రితం నిర్మాణవేత్త ఎన్.వేణుగోపాల్‌రెడ్డి పునర్నిర్మించారు. ప్రతి శుక్రవారం అమ్మవారికి, మాతృకలకు ప్రత్యేక అభిషేకాలతో, అలంకరణలతో పూజలు నిర్వహిస్తారు. ప్రతివారం ఆలయంలో నిర్వహించే ప్రత్యేకపూజలలో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయధర్మకర్త వేణుగోపాల్‌రెడ్డి కుటుంబసమేతంగా పూజలలో పాల్గొన్నారు. ఈఏడాది కూడా అమ్మవారి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు సిద్దమౌతున్నట్లు ఎన్వీఆర్ ట్రస్టు కార్యదర్శి శివకుమార్‌రెడ్డి తెలిపారు.

## కాణిపాకం సన్నిధిలో కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి



**కాణిపాకం, ఆగస్టు 2 ప్రభాతవార్త:** కర్నాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జి.పండిట్ శుక్రవారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారి వెంట ఐరాల ఇన్‌చార్జి తహశీల్దార్ సుధాకర్, స్థానిక ఎస్సై రామ్మోహన్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## తవణంపల్లె తహశీల్దార్‌గా సుధాకర్ నియామకం

**తవణంపల్లె, ఆగస్టు 2 ప్రభాతవార్త:** తవణంపల్లె మండల తహశీల్దార్‌గా ఎన్.సుధాకర్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీ వెళ్లిన తహశీల్దార్‌లను ప్రభుత్వం తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేసింది. ఈమేరకు వారికి శుక్రవారం జిల్లా కలెక్టర్ జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. ఇందులో భాగంగా తవణంపల్లె తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.అరుణకుమారిని పాలసముద్రం మండలంకు బదిలీ చేస్తూ ఆస్థానంలో ఐరాల డీటీ ఎన్.సుధాకర్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో తహశీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక మహాభారత యజ్ఞాలు

–పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్



**తవణంపల్లె, ఆగస్టు 2 ప్రభాతవార్త:** సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక మహాభారత యజ్ఞాలని వీటిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా వుందని పూతలపట్టు ఎమ్మెల్యేల డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని గాజులపల్లెలో జరుగనున్న మహాభారత యజ్ఞాన్ని ఎమ్మెల్యే పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాభారత యజ్ఞంలు నిర్వహించడం ద్వారా నవ తరానికి మన సంస్కృతి సంప్రదాయాలను తెలియజేయవచ్చునని తెలిపారు. ఈసందర్భంగా ఆయన స్థానిక ద్రౌపదీదేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు స్థానిక టీడీపీ నాయకులు ఎన్‌ఆర్‌ఐ ప్రవీణ్‌నాయుడు, మురళీల ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాతికూసాలు ధ్వంసం... రూ. 75వేలు నష్టం



**చౌడేపల్లి, ఆగస్టు 2 ప్రభాతవార్త :** పొలానికి కంచె వేసేందుకు ఏర్పాటు చేసుకొన్న రాతికూసాలను ధ్వంసం చేయడంతో రూ.75వేల మేర నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. బాధిత రైతు కథనం మేరకు... మండలంలోని చారాల పంచాయతీ జంగాలపల్లికి చెందిన రమేష్‌కు కొంత మేర పొలముంది. పొలానికి కంచె వేయడానికి రూ. 75వేలు విలువ గల 200కాతి కూసాలను ఏర్పాటు చేసుకొన్నాని రైతు తెలిపాడు. అయితే గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కూసాలను పగులగొట్టేశారని రమేష్ వాపోయాడు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రైతు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

## ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా శ్రీనివాసరావు

**చిత్తూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త:** చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావును ఈస్ట్ ఇన్స్‌పెక్టర్‌గా నియమించడంతో ఈయన ఆ మేరకు బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కుళ్ళాయప్ప వెకెన్సీ రిజర్స్‌కు బదిలీపై వెళ్ళారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వరసిద్దుని సేవలో పుట్టపర్తి ఎమ్మెల్యే



**కాణిపాకం, ఆగస్టు 2 ప్రభాతవార్త:** పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరారెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలు కుటుంబసమేతంగా శుక్రవారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరెండెంట్ శ్రీధర్‌బాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమీషన్



**కాణిపాకం, ఆగస్టు 2 ప్రభాతవార్త:** జాతీయ మానవ హక్కుల కమీషన్ విజయ భారతి సైనీ శుక్రవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి, ఐరాల మండల రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయోగశాల వస్తువులకు రూ. 60వేలు విరాళం



**చౌడేపల్లి, ఆగస్టు 2 ప్రభాతవార్త :** స్థానిక ఉన్నతపాఠశాల స్కూల్ ప్లస్ ఇంటర్ విద్యార్థుల ప్రయోగశాలకు అవసరమయ్యే వస్తువుల కొనుగోలుకు దాత రూ. 60వేలను విరాళంగా అందించారు. పట్టణానికి చెందిన డాక్టర్ పావులూరి మురళీధర్‌నాయుడు ప్రయోగశాల వస్తువులకని నగదును ప్రధానోపాధ్యాయుడు నాగరాజరెడ్డికి అందించారు. పాఠశాల నిర్మాణం కోసం స్థలాన్ని విరాళంగా పావులూరి మునస్వామినాయుడు, పావులూరి శ్రీనివాసులు నాయుడులు ఇచ్చారనీ, ఆయన తనయుడు పావులూరి మురళీధర్‌నాయుడు ఇటీవల పాఠశాల ప్రాంగణంలో ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసారని నాగరాజరెడ్డి గుర్తు చేసారు. విద్యాభివృద్ధికి సహకరిస్తున్న పావులూరి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు మురళీ, ప్రతిమ, విజయలక్ష్మి, అమరనాథరెడ్డి, సుధాకర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## గంగా భవానీకి రాహుకాలాభిషేకం

**బోయకొండ(చౌడేపల్లి), జూలై 12 ప్రభాతవార్త :** శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు రాహుకాలాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మ వారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో వేద పండితులు గోవర్ధనశర్మ ఆధ్వర్యంలో జరిగిన అభిషేకం భక్తులను అలరించింది. అనంతరం పాత కళ్యాణకట్ట భవనంలో అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఆలయ ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం స్వయంగా భక్తులకు వడ్డించారు. చౌడేపల్లి మండలం చిట్రెడ్డిపల్లికి చెందిన ప్రత్యూషా శంకరయ్య, విజయలక్ష్మిలు అన్నదానానికి రూ. 12వేలు, పలమనేరు నవీన్‌కూరగాయలనువిరాళంగాఅందించారు. అధికారులు, అర్చక, సిబ్బందిభక్తులకు వసతులు సమకూర్చారు.

## ఎస్సీఎస్టీ వర్గీకరణ ఆమోదంపై హర్షం



**పుంగనూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త :** మాదిగ, మాదిగ ఉపకులాల చిరకాల స్వప్నమైన ఎస్సీఎస్టీ వర్గీకరణ సబబే నంటూ హైకోర్టు తన అభిమతాన్ని తెలియ చేయడం పట్ల పుంగనూరు నియెజకవర్గ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం ఈమేరకు ఎమ్మార్పీఎస్ అధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సంబరాలు నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ముప్పై ఏళ్ళ కల సాకారమయ్యే వేళయిందని, త్వరలో ఈచట్టం అమలులోనికి రావాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు జి.నాగరాజు మాదిగ, గంగరాజు మాదిగ, లింగప్ప, వెంకటేశు, అన్నమయ్య, చదళ్ళ వెంకటరమణ, నాగభూషణ, రాజగోపాల్, కే.లింగప్ప, మణి, పాపన్నపాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## చంటి బిడ్డకు తల్లిపాలు పట్టించండి



**కోట, ఆగస్టు 2 ప్రభాతవార్త :**

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, తల్లులు తమ చంటి బిడ్డలకు విధిగా పాలు పట్టించాలని కోట ఐసిడిఎస్ సిడిపిఓ మునికుమారి అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కోట మండలం గూడలి పంచాయతీ దక్షిణపాలెం గ్రామంలో జరిగిన కార్యక్ర మంలో ఆమె మాట్లాడారు. శిశువు పుట్టిన వెంటనే గంటలోపు ఇవ్వాల్సిన ముర్రుపాలను అవగాహన లేమితో అపోహలతో తల్లులు ఇవ్వలేకపోతున్నారని చెప్పారు. తల్లిపాల ప్రాధాన్యతపై విస్తృత అవగాహన కల్పించేందుకు స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 7 వరకు తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు ఇళ్ల వద్దకే పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. బాలింతలను లక్ష్యంగా చేసుకొని తల్లిపాల విశిష్టతను వివరించేలా అందరూ ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాశం కాలనీలో దొంగల భయం

**కోట, ఆగస్టు 2 ప్రభాతవార్త :**

కోట మండలం గూడలి పంచాయతీ పరిధిలోని ప్రకాశం కాలనీలో రాత్రి సమయాల్లో దొంగలు సంచరిస్తున్నారని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రమేష్ అనే వ్యక్తి నివాసంలో దొంగలు చొరబడ్డారని కాలనీవాసులు చెప్పారు. దీనికితోడు ప్రకాశం కాలనీలో గత రెండు నెలల నుంచి వీధిదీపాలు వెలగడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. అంతేకాకుండా రాత్రి వేళల్లో విషసర్పాలు సైతం సంచరిస్తున్నారని తెలియజేశారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి ప్రకాశం కాలనీలో రాత్రి పూట వీధిదీపాలు వెలిగేలా చూడాలని కోరుతున్నారు.

## వనరులను వైసీపీ నాయకులు అడ్డంగా దోచేశారు

**కోట, ఆగస్టు 2 ప్రభాతవార్త :**

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్లు అప్పులు చేసి ప్రజల నెత్తిన భారం మోపిందని తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు ఆరోపించారు. శుక్రవారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ ఏ శాఖలోనూ చిల్లిగవ్వ లేదని, ఎక్కడ చూసినా అవినీతి బయటపడుతోందని పేర్కొన్నారు. సహజ వనరులన్నీ దోపిడీ చేశారని, భూములు, కొండలు కొట్టేశారన్నారు. ఇసుక దోచుకున్నారని, మద్యం సింగిల్ పాయింట్‌గా చేసి నాసిరకం సరఫరా చేసి కొల్లగొట్టారని అన్నారు. అర్హత లేని వారికి పింఛన్లు మంజూరు చేశారని ఆరోపించారు. నాడు-నేడు పనుల్లో దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.6 వేలకోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేంద్రప్రభుత్వం సహకారంతో ముందుకెళుతున్నారని అన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు : ఎమ్మెల్యే



**వెంకటగిరి, ఆగస్టు 2 ప్రభాతవార్త :**

విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న బుక్స్, స్కూల్ బ్యాగులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పాఠశాలలో కళాశాలలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం పెట్టామని వైసిపి ప్రభుత్వం ఎత్తివేసినట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. కళాశాలలో ఉన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీందర్ బాబు, మాజీ ఏఎంసి ఛైర్మన్ రాజేశ్వర రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఎనిమిదిన విద్యా కమిటీ ఎన్నికలు : ఎంఈఓ

**బాలాయపల్లి, ఆగస్టు 2 ప్రభాతవార్త :**

ఈ నెల 8న పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులచే ఛైర్మన్ వైస్ ఛైర్మన్‌ల ఎన్నికల జరుగుతుందని ఎంఈఓ కిల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. 69 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ జరుగుతుందని వివరించారు. అన్ని పాఠశాలలో ఇప్పటికే నోటిఫికేషన్లు ఏర్పాటు చేశామని దక్కిలి మండలంలో 72 పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు జరుగుతాయని వివరించారు.

## ఈ నెల 5న జరిగే ర్యాలీని జయప్రదం చేయండి

**గూడూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త :**



గూడూరు డివిజన్ పరిసర ప్రాంతాల్లో ఇసుక పూర్తిగా నిలిపివేయడంతో భవన నిర్మాణ కార్మికులు సమస్యల పరిష్కారానికై ఈ నెల 5వ తేదిన జరగనున్న ర్యాలీని జయప్రదం చేయాలని శుక్రవారం భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో నాయకులు కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. అనంతరం విలేకర్ల సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపకులు పుట్టా శంకరయ్య మాట్లాడుతూ కార్మికులు ఇసుక పూర్తిగా నిలిపివేయడంతో పనులు లేక వస్తువులతో గడుపుతున్నారని కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా ఇసుకను ఉచితంగా ఇస్తామన్న హామీని ఇంత వరకు అమలు చేయలేదు అన్నారు. సుదూర ప్రాంతాల నుండి ఇసుక అత్యవసరంగా కావాల్సి వస్తే దళారులు ఒక ట్రాక్టర్‌కు 6 వేలుకు పై మాట పలుకుతూ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ఎస్‌డి రఫీ, సీనియర్ నాయకులు గండికోట మధు, బండి కృష్ణయ్య, సిఐటియు నాయకులు జోగి శివకుమార్, శ్రీనివాసులు, బివి రమణయ్య, అడపాల ప్రసాద్, పి. సాయి తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డుకు సంజీవని

**గూడూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త :**



తల్లిపాలే బిడ్డకు సంజీవని మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదపడుతాయని ఐసిడిఎస్ ఎస్‌కె మెహబాబీ తెలిపారు. గాంధీ నగర్‌లో గవర్నమెంట్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ బిడ్డకు పుట్టిన గంటలోపే ప్రతి తల్లి పాలు ఇవ్వాలని దీంతో శిశువు ఆరోగ్యంగా పెరగడానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వరూపారాణి, చెన్నూరు పిహెచ్‌సి డాక్టర్ ఎ. లీలాకృష్ణ, సూపర్‌వైజర్ మస్తానమ్మ, ఎఎన్‌ఎం సునీత కుమారి, ఆశ వర్కలు, మహిళ పోలీస్ అర్చన, పావని, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## ట్రై సైకిల్‌లు వితరణ

**గూడూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త :**



గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి ఎమ్మెల్యే సునీల్ కుమార్ విచ్చేశారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేను కలిసి పలు సమస్యలను ఆయనకు తెలియజేశారు. ఎమ్మెల్యే ఐదు మంది దివ్యాంఉలకు ట్రై సైకిల్స్ ఒక మహిళకు కుట్టు మిషన్ అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మహిళలకు ఎమ్మెల్యే తన సొంత నిధులు పదివేల రూపాయిలు సహాయం అందించారు. అలాగే నియోజకవర్గంలో అవసరమైన దివ్యాంగులకు ట్రై సైకిల్స్ ఎలక్ట్రికల్ వాహనాలు ప్రభుత్వం ద్వారా తప్పక అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, చంద్ర, రహీం, పీట్టి నాగరాజు, సిద్ధయ్య నాయుడు, భారతి తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం

**కోట, ఆగస్టు 2 ప్రభాతవార్త :**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని ఎంఆర్‌పిఎస్ నాయకులు నాగేంద్ర అన్నారు. శుక్రవారం ఆయన కోటలో మాట్లాడుతూ మూడు దశాబ్దాల ఉద్యమం ఫలితంగానే సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చిందన్నారు. మాదిగల ఉపకులాలకు భవిష్యత్‌లు మేలు జరుగుతుందన్నారు. 1994లో ఎంఆర్‌పిఎస్ ఉద్యమం ప్రారంభ స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు నడిపించిన మందికృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు.

## బాల్య వివాహం పై అవగాహన



**చిల్లకూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త :**

బాల్య వివాహాలు వల్ల జరిగే అనర్థాలు పై మోమిడి మహిళా పోలీసులు అవగాహన కల్పించారు. శుక్రవారం మోమిడి ఎస్టీ కాలనీ అంగన్‌వాడి కేంద్రం వద్ద బాల్య వివాహం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నవయసులోనే వివాహం చెయడం వలన రక్తహీనత, తల్లి, బిడ్డకి ప్రాణానికి ప్రమాదం, చట్ట పరమైన శిక్షలు గురించి, బాలికలు పై జారీ లైంగిక వేదింపుల పై శిక్షలు అవగాహన కల్పించారు.

## ఎట్టకేలకు సొంత జిల్లాకు తహసిల్దార్లు

– పోస్టింగ్స్ కేటాయించిన కలెక్టర్ సుమిత్‌కుమార్

**చిత్తూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త:** ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇతర జిల్లాల్లో విధులు నిర్వర్తించడానికి బదిలీపై వెళ్ళిన తహసిల్దార్లకు ఎట్టకేలకు మళ్ళీ జిల్లాలో వచ్చి విధులు నిర్వర్తించడానికి ప్రభుత్వం మోక్షం కల్పించింది. ఇతర జిల్లాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించడానికి వెళ్ళిన తహసిల్దార్లను ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమీషనర్ జిల్లాకు తిరిగి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ వారికి మండలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయపు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా టి.సీతారాం, కలెక్టరేట్ మెజిస్ట్రీరియల్ సెక్షన్ తహసిల్దారుగా బ్యూలా, కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరిటెండెంట్‌గా కె.పద్మజ, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరిటెండెంట్‌గా పి.మురళీ, కలెక్టరేట్ ల్యాండ్ అక్విజేషన్ సెక్షన్ సూపరిటెండెంట్‌గా జిఎం కుమారస్వామి, కలెక్టరేట్ ల్యాండ్ రీఫామ్స్ సెక్షన్ సూపరిటెండెంట్‌గా ఆర్.వాసుదేవన్, చిత్తూరు ఆర్డీఓ కార్యాలయ డిఎఓగా ఎన్ఎస్ కృష్ణకుమార్, పలమనేరు ఆర్డీఓ కార్యాలయ డిఎఓగా మోహనవల్లి, నగరి ఆర్డీఓ కార్యాలయ డిఎఓగా .పి.శివరామన్, కుప్పం ఆర్డీఓ కార్యాలయ డిఎఓగా జి.జయప్రకాష్, చిత్తూరు అర్బన్ తహసిల్దారుగా ఎ.కళావతి, సోమల తహసిల్దారుగా కె.బెన్నురాజ్, చౌడేపల్లి తహసిల్దారుగా బి.హనుమంతులకు పోస్టింగ్స్ కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే గుడిపాల తహసిల్దారుగా జి.చంద్రశేఖర్‌రెడ్డి, సదుం తహసిల్దారుగా కులశేఖర్, నగరి తహసిల్దారుగా డి.రవికుమార్, నింద్ర తహసిల్దారుగా ఇ.శేషగిరి రావు, కార్వేటినగరం తహసిల్దారుగా ఎం.భగవతి, జిడినెల్లూరు తహసిల్దారుగా వి.చంద్రశేఖర్‌లకు పోస్టింగ్స్ జారీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఎస్ఆర్‌పురం తహసిల్దారుగా ఇ.అమరనాథ్, పాలసముద్రం తహసిల్దారుగా ఎం.అరుణకుమారి, పూతలపట్టు తహసిలారుగా ఎస్ఎం గుర్రప్ప, బంగారు పాళ్యం తహసిల్దారుగా బాబు రాజేంద్రప్రసాద్, పలమనేరు తహసిలారుగా ఆర్.ఇన్బనాథన్, వి.కోట తహసిల్దారుగా బి.పార్వతి, విజయపురం తహసిల్దారుగా ఎస్.మాధవ రాజు, కుప్పం తహసిల్దారుగా వై.చిట్టిబాబు, శాంతిపురం తహసిల్దారుగా కె.అమరనాథ్, రామకుప్పం తహసిల్దారుగా కె.బాబు, గుడుపల్లి తహసిల్దారుగా బి.రామాంజులనాయక్‌లకు పోస్టింగ్స్ కేటాయిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే తహసిల్దారు లక్ష్మీనారాయణను తిరుపతి జిల్లాకు కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

***7 మంది డిప్యుటీ తహసిల్దార్లకు తహసిల్దార్లుగా పూర్తి అదనపు బాధ్యతలు***

జిల్లాలో ఏడు మంది డిప్యుటీ తహసిల్దార్లకు తహసిల్దార్లుగా పూర్తి అదనపు బాధ్యతలు కేటాయిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గంగవరం డిప్యుటీ తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఎంఎస్ ప్రసన్నకుమార్‌ను పెద్దపంజాణి తహసిల్దారుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఐరాల డిప్యుటీ తహసిల్దారు ఎన్.సుధాకర్‌ను తవణంపల్లి తహసిల్దారుగా, గుడిపాల డిప్యుటీ తహసిల్దారు కళ్యాణిని పెనుమూరు తహసిల్దారు, చిత్తూరు అర్బన్ డిప్యుటీ తహసిల్దారు ఎస్.కిరణ్‌ను విజయపురం తహసిల్దారు, పెనుమూరు డిప్యుటీ తహసిల్దారు కె.మహేష్‌కుమార్‌ను ఐరాల తహసిల్దారు, చిత్తూరు డిఎస్‌ఓ కార్యాలయం డిప్యుటీ తహసిల్దారు జిఎల్ శివకుమార్‌ను గంగవరం తహసిల్దారు, వెదురుకుప్పం రీ-సర్వే డిప్యుటీ తహసిల్దారు జయంత్‌ను యాదమరి తహసిల్దారుగా నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

## సత్వరం ఎస్సీ కార్పొరేషన్లు ప్రారంభం

-కలెక్టరేట్ ఎదుట మాజీ ఎంపీ చింతామోహన్ ఆధ్వర్యంలో ధర్నా

**చిత్తూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త:**

గత ప్రభుత్వాలు దళితులను ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రారంభించిన ఎస్సీ కార్పొరేషన్‌ను సత్వరం పునఃప్రారంభించి అర్హులైన ప్రతి ఒక్క ఎస్సీకి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని మాజీ ఎంపీ చింతామోహన్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట శుక్రవారం మాజీ ఎంపి చింతామోహన్ ఆధ్వర్యంతో కొన్ని ఎస్సీ సంఘాలు ధర్నా నిర్వహించాయి. ఈ ధర్నాను ఉద్దేశించి మాజీ ఎంపి చింతామోహన్ మాట్లాడుతూ గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అనేక మంది దళితులు లబ్దిపొంది ఆర్థికంగా నిలదొక్కుకున్నారని, అయితే గత ఐదేళ్ళుగా ఎస్సీ కార్పొరేషన్ మూతపడిందని, తన మిత్రుడి కుమారుడు మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎస్సీ కార్పొరేషన్లను మూసి వేశారని ఆరోపించారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం దళితులకు తీరని అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు. అలాగే ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దేశ అఖండత, సమైక్యతను దెబ్బతీసే విధంగా వుందన్నారు. ఏడుమంది సభ్యుల ధర్మాసనం దేశ సమగ్రత, సమైక్యత దెబ్బతీసే విధంగా అనాలోచితంగా తీర్పు వెల్లడించారన్నారు. దీని ప్రభావంతో రానున్న పదేళ్ళలో భారతదేశం బలహీనపడుతుందన్నారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

**విజయపురం, ఆగస్టు 2 ప్రభాతవార్త:** మండలంలోని ఆలపాకం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం వందవాసి మహేష్‌శర్మ విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఒకటి నుంచి 8 వరకు చదువుతున్న విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్, నోటు పుస్తకాలు, ఫ్యాడ్లు వితరణగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమలేషు, చంద్రయ్య, ఉపాధ్యాయులు భాగ్యరాజ్, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా వర్సిటీలో ముగిసిన కెరీర్ కిక్ స్టార్టర్ ప్రోగ్రాం



**తిరుపతి విద్య, ఆగస్టు 2 ప్రభాతవార్త :** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాల యంలో ఇన్టర్నల్ క్వాలిటీ అష్యూరేన్స్ సెల్, స్టూడెంట్ అఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో లింక్డ్ ఇన్ కెరీర్ కిక్ స్టార్టర్ ప్రోగ్రాంని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ త్రిపుర సుందరి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ ప్రొ. కాత్యాయని మాట్లాడుతూ విద్యార్థినులందురు లింక్డ్ ఇన్ ప్రొఫైల్స్ క్రియేట్ చేసుకొని ఈ డిజిటల్ ప్లాట్ ఫారం ద్వారా వివిధ కంపెనీల నిపుణులతో నెట్ వర్క్ ఏర్పాటు చేసుకుని, వృత్తిపరంగా ఎదిగే అవకాశాన్ని కల్పించే ఉద్దేశంతో గత నాలుగు రోజులుగానిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినిలందరికీ లింక్డ్ ఇన్ వారు ఆరు నెలల కాంప్లిమెంటరీ ప్రీమియంను ఉచితంగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సహకార మందించిన ఫేస్ ప్రెప్, లింక్ డిన్ వారికివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. ఉమ, రిజిస్ట్రార్ ప్రొ. రజనీ అభినందనలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## శ్రీ పద్మావతి డిగ్రీ కళాశాలలో తల్లిపాల వారోత్సవాలు



**తిరుపతి విద్య, ఆగస్టు 2 ప్రభాతవార్త :** శ్రీ పద్మావతి మహిళా, డిగ్రీ, పీజీ కళాశాల (అటానమస్) లో ఆగస్టు రెండవ తేదీన తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా హోం సైన్స్ విభాగము, ఐక్యూఏసి సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ప్రిన్సిపాల్ డాక్టర్ టి. నారాయణమ్మ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు శ్రేష్టమని, వాటి ప్రాముఖ్యతను, పోషక విలువల గురించి అందరూ తెలుసుకోవాలని వివరించారు. ఈ ర్యాలీలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. భద్రమణి, హోమ్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ జి. నాగమణి, డాక్టర్ జి. శ్రీవాణి, కె. చెంచులక్ష్మి, డాక్టర్ జి. వాణి ప్రశాంతి, డాక్టర్ ఎం. ఉమారాణి, హోం సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పరనిందతో మానసిక అశాంతి : రేహాన్



**శ్రీకాళహస్తి, ఆగస్టు 2 ప్రభాతవార్త :** మన సమాజంలో నిత్యం పరనింద, పరుల చెడును కోరుకోవటమే జీవితంగా మారిందని హాఫీజే ఖుర్ అన్‌రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యఖుర్ ఆన్‌లో పలు చోట్ల స్పష్టంగ పరనింద, ఇతర అభివృద్ధిని చూసి ఓర్వలేక పోవటంను మానుకోవాలని ఇతరుల గురించి మంచి చెప్పాలన్నారు. మన చెడు కోరుకునే వారి గురించి వారికి మంచి జరగాలని ప్రార్థించమని పేర్కొన్నారన్నారు. ఎవరి గురించి ఆలోచించని వారు స్వర్గస్థులన్నారు. నేడు సమాజంలో పరుల గురించి చెడుగా మాట్లాడటమే ప్రత్యేకార్హతగా మారిందన్నారు. ఈ వాతావరణాన్ని ముస్లింలు మార్చుకోవాలన్నారు. ఆకలితో ఉన్న వాని ఆకలి తీర్చాలని ఆదేశిస్తుందన్నారు. మనం ఏది తలచిన జరగదని అల్లాహ్ ఏదీ నిర్ణయిస్తారో అదే జరుగుతుందనే సత్యాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు.

## కుష్టు నివారణ అవగాహన శిబిరం



**శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి మండలం ఎంపేడు ఆరోగ్యకేంద్రం పరిధిలోని వాగవీడు గ్రామ పంచాయతీలో శుక్రవారం జాతీయ కుష్టునివారణ అవగాహన సదస్సును తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సారధ్యంలో నిర్వహించారు. క్షయ నివారణ అధికారి ఆరోగ్య డాక్టర్ శ్రీనివాసులురెడ్డి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుధీర్‌కుమార్‌లు ఇంటింటికి వెళ్ళి అవగాహన కల్పించారు. ఈ నెల 18నుంచి 15రోజుల పాటు సర్వే నిర్వహిస్తామన్నారు. వ్యాధి లక్షణాలకు సంబంధించి ప్రజలకు వివరిస్తూ శరీరంపై స్పర్శ లేకుండా మచ్చలు, పొడలు లావవుగా మారినా నొప్పితో కూడిన నరాలు, బొడిపెలు, నొప్పులేని పుండ్లు చెవి తమ్మెదలు మందంగా మారి ఉండటం ముఖంపై నూనె రాసినట్లు జిడ్డుగా నిగ నిగలాడే చర్మం ఉండటం అని వివరించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, డిఎల్ఓ డాక్టర్‌రమణ, ఫిజియో డాక్టర్, డాక్టర్ సుధీర్‌కుమార్, కిరణ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు

## తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం



**తొట్టంబేడు, ఆగస్టు 2 ప్రభాతవార్త :** ప్రపంచ తల్లిపాల దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు శ్రీకాళహస్తి ఆధ్వర్యంలో మండలంలోని చిన్నసింగమాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅ తిధిగా సర్పంచ్ మాధవీలత, పాఠశాల ఉపాధ్యా యులు మాధవి, ఎంఎస్‌కె. ఎఎన్ఎం, సూపర్‌వైజర్ ఉష, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, గర్భిణీస్త్రీలు, బాలింతలు హజరయ్యారు. ఈసందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ శాంతిదుర్గ మాట్లాడుతూ అంతరాలను పూరించి తల్లిపాల సంస్కృతిని కాపాడుదామని తెలిపారు. కార్యక్రమంలో ఆశావర్కర్ నాగేంద్ర, ఎఎన్ఎం బుజ్జమ్మ, ఎంఎస్‌కె మహాలక్ష్మి పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్సీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పుపై హర్షం



**శ్రీకాళహస్తి, ఆగస్టు 2 ప్రభాతవార్త :** రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్లపై సంచలన తీర్పు ఇవ్వడం సంతోషమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుందని నిరూపించడం మందకృష్ణ మాదిగ ఎంఆర్‌పిఎస్ 30ఏళ్ళ సుదీర్ఘపోరాటంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ప్రాణత్యాగాలకు అమరులైన మాదిగ బిడ్డలకు ఈవిజయాన్ని అంకితం చేస్తున్నామని మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి నియోజకవర్గ నాయకులు ఇర్లరాజ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల్లో ఉన్న 59 ఉపకులాలకు ఈరోజు స్వాతంత్రం వచ్చిందని చెప్పుకోవచ్చన్నారు. సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తులతో విధించిన ధర్మాసరం జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలో తీర్పు వెల్లడించడం సంతోషమన్నారు. అనంతరం టపాకాయలు పేల్చి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు గాదిపాకుల మధుమాదిగ, వెంటకలాచలం మాదిగ, చంద్రమాదిగ, చిన్నమాదిగ, సుబ్రమణ్యంమాదిగ, గిరిమాదిగ, చాట్ల వెంకటేష్ మాదిగ, కృష్ణయ్య మాది, యువసేన అధ్యక్షులు మన్నేపల్లి ఈశ్వర్‌మాదిగ, పట్టణ అధ్యక్షులు యతీష్, ఎంఆర్‌పిఎస్ యువసేన అధ్యక్షులు పాలూరి వెంకటమునిమాదిగ, చెంచయ్య, బాలరాజు, పాల్గొన్నారు.

## అర్ధాంతర పనులను పూర్తి చేయించండి...మాజీ చైర్మెన్



**శ్రీకాళహస్తి ఆగష్టు 2 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ, అనుబంధ ఆలయాల్లో అర్ధాంతరంగా ఆగిన పనులను ఆపకుండా పూర్తి చేయించాలని మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు కోరారు. శుక్రవారం ఆయన ఆర్ధనారీశ్వరాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ చేపట్టిన అభివృద్ధి పనులు ఆగిపోవటాన్ని చూసి ఆవేదన వ్యక్తం చేసారు. స్థానిక శాసనసభ్యులు బొజ్జల సుధీర్‌రెడ్డి ఈ అంశాన్ని గుర్తించి మహాశివరాత్రి లోపల పనులు పూర్తి చేసి ఉత్సవాల నిర్వహణకు చొరవ చూపాలని కోరారు. ఈ ఆలయంను రూ. 1.8కోట్లుతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తమ హయాంలో అనుబంధ ఆలయాలకు మహర్ధశ కల్పించుటకు చర్యలు చేపట్టామన్నారు. ఆలయ అభివృద్ధి పనులను ఎంఎల్ఏ స్వయంగా పరిశీలించి పూర్తి చేయుటకు కృషి చేయాలన్నారు.

## విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ



**తొట్టంబేడు, ఆగస్టు 2 ప్రభాతవార్త :** మండలంలోని ఎస్వీఏ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ డా. కెసి. రేణుకమ్మ ఆధ్వర్యంలో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం ద్వారా ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలు నోటుపుస్తకాలు, బ్యాగులులను సుమారు 200మంది విద్యార్థినులకు అందించారు. చదువుకోవడానికి పేదరికం అడ్డుకాకూడదని ప్రభుత్వమే ప్రతి విద్యార్థిని విద్యాసామగ్రిని అందించనుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవా లన్నారు. విద్యాసామగ్రిని వితరణ చేయడంపై అధ్యాపకులు సిఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా అమ్మవారి తిరుచ్చివాహనసేవ

శ్రీకాళహస్తి, ఆగస్టు 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి శుక్రవారం రాత్రి స్వామిఅమ్మవార్ల దీపారాధన అనంతరం అమ్మవారి ఆలయం వెలుపల ఉన్న మండపంలో ఉన్న అమ్మవారి ఉత్సవమూర్తి జ్ఞానప్రసూనాంబికాదేవిని ఆలయంలోని అలంకార మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చివాహనంపై కొలువుదీర్చి వేదమంత్రాలు, మంగళవాయిద్యాలనడుమ అమ్మవారికి ఆలయ ప్రాకారోత్సవం, తిరుచ్చి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేకహారతులిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఇఓ ఎస్వి నాగేశ్వరరావు దంపతులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## అమర రాజా విద్యాలయంలో ఓటు హక్కుపై అవగాహన



**రేణిగుంట, ఆగస్టు 2 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ అమర రాజా విద్యాలయంలో విద్యార్థులకు శుక్రవారం స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగంలో ఓటు హక్కు చాలా విలువైనదని ప్రధానోపాధ్యాయురాలు గ్లోరీదేవి ప్రియ విద్యార్థులకు వివరించారు. ఓటింగ్ ప్రక్రియ ఎలా ఉంటుందో 2024-25 సంవత్సరానికి సంబంధించి స్టూడెంట్ కౌన్సిలింగ్ ఎన్నికల నిర్వహించి, అందులో విద్యార్థులను భాగ్యస్వాములను చేసి ఓటు వేసే విధానాన్ని విసిదీక రించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ ద్రౌపదీదేవి ఆలయంలో హరికథా గానం

పుత్తూరురూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ఆవరణలో మధ్యాహ్నం మహాభారత హరికథ గానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాగవతారిని పి.స్వర్ణలత హరికథ గానం చేశారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 వరకు ఈ హరికథ గానం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ హరికథ గానం భక్తులను ఆకట్టుకుంది. ప్రతి ఏటా ఆనవాయితీగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ హరికథ గానం 18 రోజుల పాటు ఉంటుందని తెలిపారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. భక్తులు స్వామివారికి అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## మర్మకళా వైద్య చికిత్స



**పుత్తూరురూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** మానవుని అరచేయి, పాదాలలోని 7 వేల నాడి కొనలను వత్తిడి చేయడం ద్వారా సామాన్య జబ్బులే గాక అనేక దీర్ఘకాలిక రోగాలను సైతం నయం చేయవచ్చన్నారు. సంఘం అధ్యక్షులు బసవరాజు, భాస్కర్‌రాజు, మంచి ఫలితాలను ఇస్తున్న ఈ వైద్యాన్ని భవిష్యత్‌లో కూడా ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమాలు గురించి వైద్య శిబిరానికి వచ్చిన వారికి పూర్తి వివరాలతో వైద్యులు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు హరిప్రసాద్, రావిళ్ళ పీహెచ్‌డీ వామనన్, బీఏఎం చెన్నై, సంఘం సభ్యులు కుప్పయ్య, రామలింగం పాల్గొన్నారు.

## చిగోరాలో పింగళి వెంకయ్య జయంతి



**తిరుపతిటౌన్, ఆగస్ట్ 2ప్రభాతవార్త:** తిరుపతిలోని రాములవారి దక్షిణమాఢ వీధిలో చిగోరా ఆధ్యాత్మిక సేవాకేంద్రంలో శుక్రవారం పింగళి వెంకయ్య 148వ జయంతి వేడుకలు, స్త్రీజనోద్ధరణకు పాటుపడిన స్త్రీ అభ్యుదయవాది మల్లాది సుబ్బమ్మ శతజయంతి వేడుకలు జరిగాయి. వక్తలు చిత్రపు హనుమంతరావు, బిజెపి సాంస్కృతికవిభాగం అధికార ప్రతినిధి గుండాల గోపీనాథరెడ్డి, బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శి సిఆర్‌కె రావు, భాగవతుల జయలక్ష్మి పింగళి వెంకయ్య, సుబ్బమ్మల చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వారి జీవిత విశేషాలను వివరించారు.

## 5 నుండి జీలో

కలవారి కోడలు కనకమహాలక్ష్మి కొత్త ధారావాహిక



**తిరుపతిటౌన్, ఆగస్ట్ 2ప్రభాతవార్త:** కూతురు జీవితం నాన్నకల, నాన్నకలే కనకమహాలక్ష్మి'కలవారి కోడలు కనకమహాలక్ష్మి'సరికొత్త ధారావాహిక 5వతేదీ సోమవారం నుండి జీ తెలుగులో ప్రసారమవుతుందని ప్రతినిధి ప్రసాద్‌గుప్తతెలిపారు. ఆసక్తికరమైనమలుపులు, అదిరిపోయేట్విస్టతో సీరి యల్స్ అందిస్తున్న జీ తెలుగు మరో ఆసక్తికరమైన అంశంగా ప్రేక్షకులకు ఆనందాన్ని అందిస్తుం దన్నారు. తండ్రీకూతుళ్ల బంధం, భార్యభర్తలఅనుబంధమధ్యఉద్వేగభరితంగాసాగే ఈ కొత్త సీరి యల్ ఆగస్టు5వతేదీనుండి సోమవారంనుండిశనివారంవరకు మధ్యాహ్నం 3గంటలకు జీ తెలుగుప్రేక్షకులకు ప్రత్యేకమన్నారు.

## హోమ్‌గార్డు కుటుంబానికి కారుణ్యనియామకం



విధి నిర్వహణలో మృతిచెందిన హోమ్‌గార్డు మోహన్ కుటుంబానికి కారుణ్య నియామకం క్రింద ఉద్యోగం కల్పించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుశుక్రవారం నియామక పత్రం కవితకు అందజేశారు. **ప్రభాతవార్త-తిరుపతి**

## గాజుల అలంకరణలో కరుమారియమ్మ



తిలక్‌రోడ్డులోని కరుమారియమ్మకు ఆడినెల శుక్రవారం సందర్భంగా గాజుల అలంకరణ చేశారు. భక్తులకు దర్శనం కల్పించారు. **ప్రభాతవార్త-తిరుపతి**



తెలుగునాటకరంగ కళాకారుడు బళ్ళారి రాఘవ చిత్రపటానికి రాయలసీమ రంగస్థలి పుష్పాంజలి ఘటించింది.

**ప్రభాతవార్త-తిరుపతి**

## గుండెపోటుతో ట్రాఫిక్ ఎస్ఐ రెడ్డినాయక్ మృతి

తిరుపతిటౌన్, ఆగస్ట్ 2ప్రభాతవార్త:



తిరుపతి ట్రాఫిక్ ఎస్ఐగా విదులు నిర్వహిస్తున్న రెడ్డినాయక్ శుక్రవారం మధ్యాహ్నం స్టేషన్‌లో విధుల్లోఉండగా తీవ్రమైన గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయాడు. మూత్రశాలకు వెళ్ళిన అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఆయన ఇప్పటికే నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచాడు. వెంటనే 108లో రుయాకు తరలించినా అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. ఎస్ఐ నాయక్ మృతదేహానికి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీ కులశేఖర్, ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణ చారి, సిఐలు, ఎస్ఐలు కన్నీటిపర్యంతమయ్యారు. నివాళులర్పించారు. నాయక్ స్వగ్రామం కెవిపల్లిమండలం జిల్లెల్లమంద పెద్దతాండ. కుటుంబసభ్యులను ఎస్పీ పరామర్శించారు.

## నగరి తహసీల్దార్‌గా రవికుమార్



**నగరి, ఆగస్టు 2 ప్రభాతవార్త:** నగరి తహసీల్దార్‌గా డి.రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముందు తహసీల్దార్‌గా పని చేస్తున్న చంద్రశేఖర్ బదిలీపై కడప జిల్లాకు వెళ్ళడంతో ఎన్నికల విధుల నిమిత్తం అనంతపురం తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన రవికుమార్ బదిలీపై నగరికి విచ్చేశారు. శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన ఆయన స్థానిక అంశాలపై చర్చించారు. తనకు గతంలో నగరిలో ఆర్ఐగా, డీటీగా పని చేసిన అనుభవం ఉందని రెవెన్యూ పరంగా ఎలాంటి సమస్యలు రాకుండా త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రయత్నిస్తానన్నారు.

## రేపు జిల్లా స్థాయి చెస్ పోటీలు

**నగరి, ఆగస్టు 2 ప్రభాతవార్త:** చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంయుక్తంగా లయన్స్‌క్లబ్ నిర్వహించే చెస్ పోటీలు ఈ నెల 4వ తేదీ ప్రారంభమవుతుందని ఆ సంస్థ జిల్లా డైరెక్టర్ ప్రభాకర్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-16 జూనియర్ కేటగిరి, అబౌవ్ 16 సీనియర్ కేటగిరి అంటూ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలోని వీకేఆర్ పురం గ్రామం తిరుత్తణి-రేణిగుంట జాతీయ రహదారిలో ఉన్న అశ్విని కన్వెన్షన్ సెంటర్‌లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటల లోపు క్రీడాకారులు హాజరు కావాలన్నారు. పాల్గొనే క్రీడాకారులకు నిర్వాహకులే భోజన వసతి కల్పిస్తారన్నారు. వివరాలకు 9866112017 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

## యువతను సిద్ధం చేయడమే ఎన్‌సీసీ లక్ష్యం

**నగరి, ఆగస్టు 2 ప్రభాతవార్త:** బాధ్యతాయుత యువతను సిద్ధం చేయడమే ఎన్‌సీసీ లక్ష్యమని తిరుపతి ఎన్‌సీసీ కార్యాలయ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వాద్వా అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌జీఎస్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 5ఏ బెటాలియన్ బాలికల ఎన్‌సీసీ యూనిట్ విభాగం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జాతీయ సమైక్యత అలవరిచేలా సమాజం పట్ల బాధ్యతతో వ్యవమరించేలా శిక్షణ ఇచ్చే ఉద్దేశంతోనే ఎన్‌సీసీ (నేషనల్ క్యాడెట్ కార్ప్స్) స్థాపించబడిందన్నారు. డీవైఈవో ప్రభాకర్‌రాజు మాట్లాడుతూ ఎన్‌సీసీ లక్ష్యం యువ పౌరుల్లో సహృదయత, క్రమశిక్షణ, లౌకిక దృక్పథాన్ని పెంపొందించడం మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే అన్నారు. ఎన్‌సీసీ అధికారులు నాయబ్, సుబేదార్, అజిత్, కుమార్, నాయక్ ప్రకాష్, ప్రధానోపాధ్యాయురాలు పార్వతీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నారిపై కుక్కల దాడి..తీవ్రగాయాలు



**శ్రీకాళహస్తి, ఆగస్టు 2 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి పట్టణంలో కుక్కల బెడద ఎక్కువైంది. దీంతో ప్రజలు ఎంఎల్‌ఏను విన్నవించుకోగా పురపాలక సంఘ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిసింది. గురువారం రాత్రి ఓ రెండె నెలల చిన్నారిని కుక్కలు కరగా తల్లిదండ్రులు తల్లడిల్లపోయారు. వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఇకనైనా పురపాలక సంఘ అధికారులుకుక్కల బెడదలను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# తిరుపతి డివిజన్

## తల్లిపాలను ఉపయోగించడమే ఉత్తమం : సిడిపిఓ



**నారాయణవనం, ఆగస్టు 2 ప్రభాతవార్త :** బిడ్డ శ్రేయస్సు కోసం తల్లిపాలనే ఉయోగించాలని సిడిపిఓ శోభారాణి తెలిపారు. శుక్రవారం నారాయణవనంలో బాల్య వివాహాలను అరికట్టడం కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని పిచ్చాటూరు ప్రాజెక్టు ఐసిడిఎస్ సిడిపిఓ శోభారాణి కోరారు. మండలకేంద్రంలోని నారాయణవనం 1,2 సెంటర్లలో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం కలిగే అనర్థాల గురించి వివరించారు. సూపర్‌వైజర్ బేబి, తల్లులు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

## ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం

**నారాయణవనం, ఆగస్టు 2 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని నారాయణ వనంలో ప్రసిద్ధి చెందిన ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి శుక్రవారం సాయంత్రం 6గంటలకు శాస్త్రోక్తకంగా ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 14వ తేది వరకు మహాభారతం చెప్పడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద ఆర్‌డి ఏకాంబరం, ఆలయ ధర్మకర్త ధర్మకర్త దేశప్పరెడ్డి, చొప్పా. మునిరాఘవులు శెట్టి, వి.ఆంజనేయులుశెట్టి అండ్ సన్స్, బి.చెంచయ్యశెట్టి అండ్ గుప్తా, వర్తక, వాణిజ్యసంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## మూసి వేయబడ్డ మంచినీటి బోరు పంపు



**పాకాల, ఆగస్టు 2 ప్రభాతవార్త :** పాకాల పట్టణంలో సత్తెమ్మ గుడి ముందు చేతి బోరు పంపు కొంతకాలంగా ప్రహరీ గోడతో మూసి వేయబడి ఉంది. ప్రతి ఇంటికి మిక్సీలు గ్రైండర్లు ఎన్ని ఉన్నా రోలు అవసరం తప్పనిసరిగా ఉంటుంది. ఆ విధంగా కొంత మంది మేధావులు ప్రస్తుతం టాప్ తిప్పితే ట్యాంకులోని నీళ్లు వస్తున్నాయి కదా అనుకున్నారో ఏమో? చేతి బోరు అవసరం ఏముంది ప్రహరీ గోడ కట్టి బోరుని శాశ్వతంగా మూసేశారు. విద్యుత్ సహాయంతో నడిచే బోర్లు ఎన్ని ఉన్నప్పటికీ అవన్నీ కూడా ఏదైనా అనుకోని సంఘటన జరిగి విద్యుత్ సరఫరా ఆటంకం కలిగినప్పుడు చేత బోరు అవసరం తెలుస్తుంది. అందువల్ల ఉన్నత అధికారులు స్పందించి ప్రహరీని తొలగించి హ్యాండ్ బోరుని భక్తులకు, స్థానిక ప్రజలకి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

## దామల చెరువు టౌన్‌కి బైపాస్ రోడ్డు కావాలి

మేడసాని పురుషోత్తం నాయుడు



**పాకాల, ఆగస్టు 2 ప్రభాతవార్త :** పాకాల మండలం దామలచెరువు తరచూ ట్రాఫిక్ సమస్యలు పెరుగుతూ ఉండడంతో కుక్కలపల్లి దళితవాడ నుంచి కట్టకిందపల్లి చిత్తూరు, పీలేరు హైవే వరకు దాదాపు 1.6 కిలోమీటర్లు నూతన రోడ్డు నిర్మాణం చేయాల్సిందిగా స్థానికులు, వాహనదారులు చాలా కాలం నుంచి కోరుచున్నారని, టౌన్‌లో శ్రీ రాములువారిగుడి దగ్గర తరచూ ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడడం. టౌన్ మధ్యలో ఉన్న వంక పైన బ్రిడ్జి ఇప్పటికే శిధిలావస్థకు చేరడం. మామిడిపండ్ల సీజన్‌లో టౌన్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతూ ఉండటం. వలన ప్రత్యామ్నాయ మార్గంగా చేపట్టవల్సిందిగా భారతీయ జనతా పార్టీ చంద్రగిరి అసెంబ్లీ ఇంచార్జ్ మేడసాని పురుషోత్తం నాయుడు కోరుతున్నారు.

## పాఠశాలల్లో కమిటీ ఎన్నికల కొరకు నోటిఫికేషన్



**పాకాల, ఆగస్టు 2 ప్రభాతవార్త :** పాకాల మండలం విద్యాశాఖాధికారి కమిటీ ఎన్నికల కొరకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని మండల విద్యాశాఖ అధికారి బాబ్జి అన్నారు. ఆయన శుక్రవారం తమ కార్యాలయంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8వ తేది పాఠశాలలో యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## వర్గీకరణపై ఎంఆర్‌పిఎస్, టిడిపి సంబరాలు



**చంద్రగిరి, ఆగస్టు 2 ప్రభాతవార్త:** ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై చట్టబద్ధతకు భారత అత్యున్నత న్యాయస్థానం సుముఖత వ్యక్తం చేయడం పట్ల ఎంఆర్‌పిఎస్, టిడిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం టవర్ క్లాక్ వద్ద గల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి ఎస్సీ సెల్ మండల నాయకుడు విసిరిపాటి శంకర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు సుప్రీమ్ కోర్టులో తీర్పురావడానికి కృషి చేసినందుకు కృతజ్ఞతగా ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంగీతం రామ్మూర్తి, పోట్లూరి రామారావు, కొడిదల రామ్మూర్తి, కృష్ణయ్య మాదిగ, చెంగల్రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సంక్షేమమే నా కర్తవ్యం : ఎంఎల్‌ఏ

**రామచంద్రాపురం, ఆగస్టు 2 ప్రభాతవార్త:** కార్యకర్తల సంక్షేమమే నా కర్తవ్యమని ఎంఎల్‌ఏ పులివర్తి నాని అన్నారు. శుక్రవారం రాయలచెరువు పేట గ్రామంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి జన్మదిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్‌చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం తిరుమలరెడ్డి పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలు వున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కేశవులు నాయుడు, జనార్ధన్ చౌదరి, నరశింహారెడ్డి, విజయ్‌కుమార్ రాయల్, రావిళ్ళ గిరి, నాగభూషణం, మాదవయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందాం : ఎంఎల్‌ఏ



**రామచంద్రాపురం, ఆగస్టు 2 ప్రభాతవార్త:** చంద్రగిరి నియోజకవర్గాన్ని అందరూ కలసి కట్టుగా అభివృద్ధి చేసుకుందామని ఎంఎల్‌ఏ పులివర్తి నాని అన్నారు. శుక్రవారం ఎన్ఆర్ కమ్మపల్లిలో జరిగిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్థులను పేరుపేరునా పలకరిస్తూ ముందుకుసాగారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనగెలుపు కోసం మొక్కుకున్న మ్రొక్కులను తీర్చుకున్న ఎన్ఆర్ కమ్మపల్లి ప్రజలకు జీవితాంతం రుణపడి వుంటానన్నారు. గ్రామస్థులు తనపై చూపిన ఆధరాభి మానాలు వెలకట్టలేనివన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, మాజీ ఎంపిపి కేశవులు నాయుడు, గ్రామకమిటీ అధ్యక్షుడు చిట్టిబాబు నాయుడు, నాయకులు జనార్ధన్ చౌదరి, నరశింహారెడ్డి, రావిళ్ళ గిరి, విజయ్‌కుమార్ రాయల్, ఓబి మునిరత్నం నాయుడు, ఎం.మునిరత్నం నాయుడు, ఏ.మునిరత్నం నాయుడు, నారాయణస్వామినాయుడు, హనుమంతు నాయుడు, రధీష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు పనితీరు మార్చుకోండి

**వడమాలపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త:** అధికారులు పని తీరు మార్చుకుని ప్రజల కోసం పని చేయాలని వడమాలపేట జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి కోరారు. వడమాలపేట మండలం సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రెవెన్యూశాఖ నుంచి ఎవరూ హాజరు కాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఆక్రమించుకుంటున్నా అధికారులుపట్టించుకోవడం లేదని జడ్పీటీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అధికారుల పని తీరులో మార్పు రావాలి తెలిపారు. ఎస్‌బీఆర్ పురం సర్పంచ్ మణిరాజు మాట్లాడుతూ గూళూరు చెరువు కాలువలు మరమ్మతుచేయాలని, సుమారుగా రెండు వందల ఎకరాల మేరకు నీటి నిల్వతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంచాయతీల్లో నిధుల లేమితో అభివృద్ధి పనులు చేయలేక పోతున్నామనిసర్పంచ్‌మంజుల బుజ్జిరెడ్డి తెలిపారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా మహా రుద్రాభిషేకం



**వడమాలపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త:** స్థానిక భవానీశంకర దేవాలయంలో మహాశివుని జన్మ నక్షత్రం ఆరుద్ర సందర్భంగా మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం మహా శివుడి మహాలింగానికి వేద మంత్రాలతో అభిషేకం నిర్వహించారు. రుద్ర గమకాలు పటిస్తూ భక్తుల శివనామ స్మరణల నడుమ మహా రుద్రాభిషేకం నిర్వహించారు. పురోహితులు శివ, సాయిల ఆధ్వర్యంలో మహాశివుని లింగాన్ని పూలమాలలతో సర్వంగా సుందరంగా అలంకరించి మంగళ హారతులు ఇచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

## సాకాంబరీ దేవి అలంకారంలో వాసవాంబ



వడమాలపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు సాకాంబరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసం శుక్రవారం సందర్భంగా వాసవీదేవిని వివిధ రకాల కూరగాయలతో సుందరంగా అలంకరించారు. మంగళ హారతులు ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశ్వారు. భక్తులు నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

# నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేద్దాం : ఎమ్మెల్యే



పిచ్చాటూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త: సత్యవేడు నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, కూటమి ప్రభుత్వానికి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపు నిచ్చారు. శుక్రవారం పిచ్చాటూరు ఎంకేటీ మహల్‌లోసత్యవేడు నియోజకవర్గం లోని 7 మండలాలకు చెందిన ఎంపీడీవోలు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, పశువైద్య, విద్యుత్, వ్యవసాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు ఉపయోగపడే టీపీ కోట రోడ్డు, దాసుకుప్పం, బైపాస్ రోడ్డు, అరణియార్, కాళంగి ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. ప్రధానంగా అధికారులు, కూటమి ప్రభుత్వ స్థానిక నేతలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. అనంతరం పిచ్చాటూరు మండల తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి మాట్లాడుతూ వెంగళత్తూరు- పెన్నాలూరుపేట డబుల్‌రోడ్డు విస్తరణ ప్రతిపాదన దశలోనే ఉందని సభ దృష్టికి తెచ్చారు. అలాగే తులసికృష్ణాపురంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, జైకా నిధులతో అరణియార్ కట్టను ఆదునికీకరణ పనులు చేపట్టాలని ఇళంగోవన్‌రెడ్డి కోరారు. నారాయణవనం నుంచి ప్రవహించే అరుణానదిలో రంగునీళ్ల వదలకుండా కాపాడుకోవాలని టీడీపీసీనియర్ నేత భాస్కర్ కోరారు. కేవీబీ పురం మండలంలోచెరువులు మరమ్మతులు చేయాలని, పాడైన వంతెనలు, రోడ్ల నిర్మించాలని మండల పార్టీ అధ్యక్షులు రామాంజులనాయుడు అధికారులకు సూచించారు. నాగలాపురం మండల టీడీపీ అధ్యక్షుటు టీపీ కోట రోడ్డుతో పాటు వరదలకు కొట్టుకుపోయిన ద్వారకానగర్ వంతెన నిర్మాణం చేపట్టాలన్నారు. సత్యవేడు టీడీపీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఆక్రమణకు గురైన శ్మశనాల సమస్యను పరిష్కరించాలని, రోడ్లు, తాగునీరు వంతు మౌలిక వసతులు కల్పించాలని సభ దృష్టికి తెచ్చారు. బుచ్చినాయుడు కండ్రిగ మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు మాట్లాడుతూ బీఎన్ కండ్రిగ నుంచి సూళ్లూరుపేట వరకు రోడ్డును డబుల్‌రోడ్డుగా విస్తరణ పనులు చేపట్టాలని, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. వరదయ్యపాళెం మండల టీడీపీ అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ తమ మండలంలోని చెరువులు మరమ్మతులు చేయడం ద్వారా రైతులకు సాగునీరందించే విధంగా చర్యలు చేపట్టాలని, అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్, తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఇరిగేషన్ ఈఈ మదన గోపాల్, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఆర్అండ్‌బీ ఇరిగేషన్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, పశు వైద్య, విద్యుత్, వ్యవసాయశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీనాయకులు క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, పద్దు రాజు, టౌన్ ప్రెసిడెంట్ వాసు, జనసేన, బీజేపీ పార్టీలకుచెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక శోభతో ముగిసిన చెవిరెడ్డి షిరిడి యాత్ర



తిరుపతిరూరల్, ఆగష్టు 2 ప్రభాతవార్త: చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగురోజులు పాటు కొనసాగిన షిరిడి యాత్ర భక్తి భావంతో శుక్రవారం శోభయానంగా ముగిసింది. చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా వైకాపా నేతలు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గతనెల 30న తిరుచానూరు రైల్వేస్టేషన్ నుండి షిరిడి యాత్రకు వెళ్ళిన విషయం తెల్సిందే. భక్తిభావంతో వెళ్ళిన దైవ యాత్రకు ఎలాంటి ఆటంకం కలగకుండా షిరిడి సాయినాథుని దర్శించుకుని క్షేమంగా ఇళ్ళు చేరారు. షిరిడి యాత్రలో ఎలాంటి ఆటంకం కలగకుండా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తీసుకున్న శ్రద్ద అంతాఇంతా కాదని, షిరిడి యాత్రకు వచ్చిన ప్రతి ఒక్కరిని తమ కుటుంబ సభ్యులుగా భావించి దైవ యాత్రను ముగించారు. మంగళవారం తిరుచానూరు రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక రైలులో ప్రయాణం సాగినప్పటి నుండి వైకాపా నాయకులు కార్యకర్తలపై చెవిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టి అన్ని సదుపాయాలు కల్పించడంపై వైకాపా నాయకులు, కార్యకర్తలలో సంతోషానికి అవధులు లేవు. రాష్ట్రంలో ఇలాంటి ప్రజా నేతను చూడలేమని, ప్రజాక్షేత్రంతో గెలుపు ఓటమిలు సహజమని, కానీ నాయకులకు కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా భావించి దైవ దర్శనానికి తీసుకెళ్ళిన చెవిరెడ్డి కుటుంబానికి ఎల్లవేళల ఋణపడి ఉంటామని తెలిపారు.

## శ్రీ మారుతి హాస్పిటల్స్‌లో... అరుదైన శస్త్ర చికిత్స విజయవంతం



తిరుపతి హెల్త్, ఆగస్టు 2 ప్రభాతవార్త : స్థానిక బస్టాండ్ సమీపంలోని శ్రీ మారుతి హాస్పిటల్స్‌లో అతి క్లిష్టమైన బ్రాంకో ఆర్ట్ ఎంప్లాయిజేషన్ శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మారుతి కృషి తెలిపారు. వివరాల్లోకెళ్తే 65 సంవత్సరాల వయసుగల మహిళ దగ్గుతో రక్తస్రావం అవుతూ శ్రీ మారుతి హాస్పిటల్ ఎమర్జెన్సీ విభాగానికి వచ్చారు. వెంటనే ఇంటర్నేషనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎంపి నరసింహ ఆమెను పరీక్షించి ఎమర్జెన్సీ బ్రాంకో ఎంబోలైజేషన్ అనే అడ్వాన్స్ పద్ధతిలో రక్తస్రావాన్ని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఆపరేషన్ కోత లేకుండా కార్డియాలజిస్ట్ డాక్టర్ పి. చంద్రశేఖర్ రెడ్డి, రేడియోలజిస్ట్ నవీన్ పర్యవేక్షణలో విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని డాక్టర్ నరసింహ తెలిపారు. అన్ని విభాగాలతో కూడిన అత్యాధునిక పరికరాలు, అత్యంత నైపుణ్యం కలిగిన వైద్యులు అందుబాటులో ఉండడం వల్లనే ఈ శస్త్ర చికిత్స విజయవంతంగా చేయగలిగామని ఆయన పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ మారుతీ కృష్ణ మాట్లాడుతూ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలకు పరిమితమైన బ్రాంకో ఆర్ట్ ఎంప్లాయిజేషన్ శస్త్ర చికిత్స ఇప్పుడు మన తిరుపతి మారుతి హాస్పిటల్‌లో అందుబాటులో ఉందన్నారు. ఇటువంటి క్లిష్టమైన శస్త్ర చికిత్సలు 24 గంటలు శ్రీ మారుతి హాస్పిటల్ నందు అందుబాటులో ఉంటుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ మారుతి హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్నేహానికి స్వర్ణోత్సవం

**-ఎస్‌వి వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థుల కలయిక**



తిరుపతి హెల్త్, ఆగస్టు 2 ప్రభాతవార్త : స్నేహానికి స్వర్ణోత్సవం అన్నట్లు 1974వ బ్యాచ్ సంబంధించిన పూర్వ వైద్య విద్యార్థుల అపూర్వ కలయికలో పాల్గొన్నారు. దేశ విదేశాలు ఎక్కడెక్కడో స్థిరపడి, వైద్యరంగంలో ఎన్నో మార్పులు చూసిన, పూర్వ వైద్య విద్యార్థులు సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఎస్వీ వైద్య కళాశాల వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ పిఏ చంద్రశేఖరన్‌ను కలిసారు. వారు చదువుకున్న వైద్య కళాశాలను సందర్శించి వారి మరపురాని రోజులను గుర్తు చేసుకుని బాజా భజంత్రీలతో, వైద్య కళాశాల, రుయా ఆసుపత్రి నందు వారు చదువుకున్న పనిచేసిన రోజులను గుర్తు చేసుకుని, సంబరాల్లో మునిగారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వారి బ్యాచ్ సంబంధించిన వారందరిని కళాశాలకు తీసుకొని రావడం జరిగింది. వీరు సుమారు 15 లక్షల రూపాయిలు ఖర్చుతో ఫ్యాకల్టీ క్లబ్‌ను రెన్యుయేట్ చేసి ఎస్‌వి వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు అందించారు. రాబోవు రోజుల్లో కళాశాలకు మెరుగైన డిజిటల్ లైబ్రరీని సమకూర్చడానికి నోబెల్ ఆసుపత్రి అధినేత డాక్టర్ కె. రవీంద్రనాథ్, తనవంతు సహాయము అందిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ వైద్య విద్యార్థులు, డాక్టర్ కిరీటి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సునీత, డాక్టర్ సత్యనారాయణ మూర్తి, ఎస్వీ వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

## బాలికల ఎస్సీ హాస్టల్ ఆకస్మిక తనిఖీ

**-సదుపాయాలపై ఎంఎల్‌ఏ ఆరా**



తొట్టంబేడు, ఆగస్టు 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ బాలికల ఎస్సీ హాస్టల్‌ను గురువారం ఎంఎల్ఏ బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార సదుపాయాలుపై హాస్టర్ వార్డెన్‌తో వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు భోజన సదుపాయం మరియు విద్యార్థులకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలో హాస్టల్లోవిద్యార్ధులకు అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో ఉన్న సమస్యలను నెలలోపు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్డీఏ ప్రభుత్వ ంవిద్యార్థులకు ఉన్నత స్థానాలు కల్పించే విధంగా కార్యాచరణ రూపొందించామని ఇక్కడ విద్యార్థులకు సరైన సదుపాయాలు లేవని గుర్తించామని మరో రెండు నెలల్లో కార్పొరేట్ మరమ్మత్తులు చేస్తామన్నారు. వసతిగృహంలోని ప్రతి గదిని పరిశీలించారు. చిన్నారులు ఉంటే వసతిగృహంలో పైన పెచ్చులు ఊడుతుండడంతో గమనించిన ఆయన మరమ్మత్తుల చేయడంతో పాటు వెంటనే విద్యార్థినులకు కావాల్సిన మౌళిక సదుపాయాలను కల్పించేందుకు ముందుటా మన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, వార్డెన్ హేమలత, పలువురు విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఓటేరు కాల్వలో ఎంఎల్ఏ పాదయాత్ర



శ్రీకాళహస్తి,ఆగస్టు 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఆయన గెలిచిన తరువాత మొట్టమొదటి పాదయాత్ర ఓటేరు కాల్వ నుంచి శ్రీకారం చుట్టారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటి పరిధిలో ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి సుమారు 18వేల పై చిలుకు ఓట్టు మెజారిటి వచ్చింది. దాంతో మున్సిపల్ పరిధిలోని సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి ఆయన ఎపెద్ద పీట వేస్తున్నారు. ఈ నేపధ్యంలోనే మున్సిపల్ పరిధిలోని పారిశుద్యానికి ప్రాధాన్యత కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మెప్పించి రూ.59.75 లక్షల నిధులు సాధించారు. ఈ నిధులతో ఓటేరు కాల్వలోని సిల్టు తొలగింపుతో పాటు చక్కబెట్టడానికి నిర్ణయించారు. ఆయనతో పాటు కమిషనర్ ఎం.రమేష్‌బాబు, ఇంజనీర్లు, పార్టీ నాయకులు మునిరాజనాయుడు, విజయకుమార్ నాయుడు మైనారిటి నాయకులు జిలాని, షాకిర్ అలి, కాసరం రమేష్, కంఠారమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులు తప్పనిసరిగా...కౌలుదారు సర్టిఫికేట్ తీసుకోవాలి

**- జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు**



తిరుపతిరూరల్, ఆగష్టు 2 ప్రభాతవార్త: కౌలు రైతులు తప్పనిసరిగా కౌలుదారు సర్టిఫికేట్ తీసుకోవాలని...ల్యాండ్ ఓనర్‌తో పాటు కౌలు రైతుకు కూడా అన్నదాత సుఖీభవ వర్తిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం సి.గొల్లపల్లి రైతు సేవ కేంద్రంలో రైతులకు ఈ-పంట నమోదుపై గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో జిల్లా వ్యవసాధికారి ప్రసాదరావు మాట్లాడుతూ ఈ- క్రాప్ పంట అవశ్యకత గురించి సమూలంగా రైతులకు వివరించారు. ప్రతి రైతు ఇ-క్రాప్ పంటను నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు, కౌలు రైతులు సర్టిఫికేట్స్ తీసుకుంటే బ్యాంకు ఋణాలు కూడా పొందవచ్చునని తెలిపారు. రైతులు వ్యవసాయానికి సంబంధించి సమగ్ర సమాచారాన్ని తెలుసుకుని, లాభసాటి వ్యవసాయం చేయాలని సూచించారు. ఈ గ్రామసభలో ఏడిఏ మనోహర్, ఏవోలు మమత, హరిత, రైతు సేవ కేంద్రం ఇన్‌చార్జి ప్రేమలత, రైతులు పాల్గొన్నారు.

## టిడ్కో గృహాలను నాశనం చేసిన వైసిపి ప్రభుత్వం : ఎమ్మెల్యే



వెంకటగిరి, ఆగష్టు 2 ప్రభాతవార్త : టిడ్కో గృహాలను గత ప్రభుత్వం పనులు చేయకుండా నాశనం చేసిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలను ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు. తెలుగుదేశం ప్రభుత్వం గృహాలు పనులను పూర్తి చేస్తే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రంగులు వేసుకున్నారని విమర్శించారు. ఐదు సంవత్సరాల నుండి గృహాల పనులు చేయకుండా ఆపివేశారని తెలిపారు. గృహాల పనులకు 11 కోట్ల రూపాయిలు ప్రభుత్వం మంజూరు చేసిందని ఆగిన పనులను పూర్తి చేస్తామని తెలిపారు. లబ్ధిదారులు నివాసం ఉండకుండా బాడుగకు ఇల్లు ఇస్తే వాటిని రద్దు చేస్తామని తెలిపారు. కరెంటు, త్రాగునీరు సమస్య ఉందని స్థానికులు ఎమ్మెల్యేకి తెలుపగా వెంటనే పరిష్కరించాలని కమిషనర్ అబ్దుల్ నజీర్ ఆదేశించారు. ఆకతాయిల ఆగడాలు కూడా ఎక్కువగా ఉన్నాయని కొందరు చెప్పగా అరికట్టాలని ఎస్ఐ నాయక్ ఆదేశించారు. ఒక ఇల్లు బాడుగకి ఇస్తామని బోర్డు పెట్టగా సెల్ఫోన్ నంబర్‌కి యజమానితో ఎమ్మెల్యే మాట్లాడి ఇలాంటివి చేస్తే ఇల్లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వర రావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వర రావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు పప్పు చంద్రమౌళి రెడ్డి, నాయకులు ఆనంద్, శ్రీనివాసులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సేవకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే



గూడూరు, ఆగష్టు 2 ప్రభాతవార్త : గ్రామ సేవకుల న్యాయమైన డిమాండ్లపై అసెంబ్లీలో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ హామీ ఇచ్చారు. గూడూరు పట్టణంలోని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ భవనంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సేవకులు ఎమ్మెల్యేగా గెలుపొందిన పాశిం సునీల్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. పలు సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ అతి తక్కువ నెలసరి వేతనంతో గ్రామ సేవకులు అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నారని అన్నారు. గ్రామ సేవకులు తెలియజేసిన సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బంది పడటానికి గత వైసిపి ప్రభుత్వం కారణమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్ గ్రామ అధికారుల సంఘం అధ్యక్షులు రమణయ్య, విఆర్ఏ జిల్లా కార్యదర్శి కొల్లపూడి సుబ్బయ్య, సభ్యులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ పంటసాగు లక్ష్యాలు వందశాతం పూర్తి

**- వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ దిశా నిర్దేశం**



చిత్తూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త: ఖరీఫ్ పంట సాగు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శుక్రవారం జెసి పి.శ్రీనివాసులు జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణతో కలిసి ఖరీఫ్ సాగుపై ఎడిలు, ఎఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ గత ఏడాది ఖరీఫ్ సాగు లక్ష్య నిర్దేశితం కంటే ఈ ఏడాది ఎక్కువ పంట సాగు చేయడానికి అనుగుణంగా గ్రామ స్థాయిలో రైతులకు అధికారులు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలన్నారు. ఈ సీజన్‌లో రైతులు వేరుసెనగ, వరి, రాగులు, కందులు, ఉలవలు తదితర పంటలు సాగు చేసుకొనేలా వారిలో అవగాహన పెంపొందించాలన్నారు. అలాగే రైతులకు వ్యవసాయ రుణాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్న బ్యాంకు అధికారులకు మాట్లాడి రైతుకు సకాలంలో రుణం మంజూరు చేయాలని స్పష్టం చేశారు. పలమనేరు, బంగారుపాళ్యం మండలాల్లో వేరుసెనగ పంట సాగు చేస్తే అడవి పందులు, ఏనుగుల వల్ల రైతుకు నష్టం వాటిల్లుతుందని దీంతో ఈ పంటలు సాగుకు రైతులు ముందుకు రావడం లేదని ఎడిలు తెలిపారు. సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు సంబంధించి రాయితీ వుంటే ఆ మేరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకొనేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఎడిలు, మండల వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో మంత్రి రాంప్రసద్‌రెడ్డి పుంగనూరు పర్యటన



పుంగనూరు,ఆగస్టు 2 ప్రభాతవార్త: రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి త్వరలో పుంగనూరు నియోజకవర్గంలో పర్యటించేందుకు రంగం సిద్దమౌతోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సివి రెడ్డి తెలిపారు. ఈమేరకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని నియోజకవర్గ దేశం కన్వీనర్ చల్లా రామచంద్రారెడ్డి రాయచోటి పర్యటనలో కలసి వివిధ విషయాలు చర్చించారన్నారు. పుంగనూరు నియోజక వర్గంలో ఉన్న సమస్యల గుర్తింపుతో పాటూ తెలుగుదేశం కేడర్‌ను పలకరిం చేందుకే ఈపర్యటన ఉంటుందన్నారు. పదేళ్ళ వైకాపా నాయకుల దారుణ హయాంలో చితికిపోయిన దేశం కుటుంబాలను గుర్తించడం జరుగుతోందన్నారు. ప్రశి ్నంచే వారు ఉండరనే ధైర్యంతో షికారీల భూములపై కూడా దౌర్జన్యం జరిగినట్లు తెలిసిందని,ఆప్రాంతాలను కూడా మంత్రి పర్యటించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మంత్రి పర్యటన తేదీలను ముందస్తుగా ప్రకటిస్తామని వివరించారు.

## మిస్ యూనివర్స్ ఎపి చందనను అభినందించిన సిఎం

**- మిస్ యూనివర్స్ ఇండియా పోటీలకు ఎంపికైన కుప్పం యువతి !!**



కుప్పం, ఆగస్టు 2 ప్రభాతవార్త : ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన మిస్ యూనివర్స్ ఎపి పోటీల్లో విజేతగా నిలిచిన చందన జయరాం శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆమెను అభినందించారు. త్వరలో ముంబైలో జరిగే మిస్ యూనివర్స్ ఇండియా పోటీల్లో రాష్ట్రం తరపున తాను పాల్గొంటున్నట్లు ఆమె సిఎంకు వివరించారు. కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం ఎంకెపురంకు చెందిన తెదేపా సీనియర్ నేత ఉయ్యాల జయరాంరెడ్డి కుమార్తె అయిన చందన జయరాం మిస్ యూనివర్స్ ఇండియా పోటీలకు అర్హత సాధించడం పట్ల సిఎం చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. మిస్‌యూనివర్స్ ఇండియాగా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా ఉయ్యాలజయరాంరెడ్డి కుటుంబీకులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యతో పాటు విలువలను బోధించాలి

**-సంప్రదాయాలపై అవగాహన కల్పించాలి: మాజీ ఎంఎల్ఏ ఎస్‌సివి**



శ్రీకాళహస్తి ఆగష్టు 2 ప్రభాతవార్త : ప్రభుత్వ.ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు మన సంప్రదాయాలను, విలువలను బోధించాలని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు అన్నారు. శుక్రవారం ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు స్టార్ కృష్ణ ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌సివి నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు జ్ఞానాన్ని సంపాదించుకోవటం అంటే విద్యతో పాటు సుగుణాలు,వ్యక్తిత్వ వికాశం ఉపాధ్యాయులు బోధించాలన్నారు. ఈ వయస్సులోనే నేటి తరానికి మన సంప్రదాయాలు, సంస్కృతి ఉన్నతిని తెలియజేయాలన్నారు. విద్యార్థులు ఎ క్కువ సమయం పాఠశాలల్లోనే ఉంటారు కాబట్టి ఉపాధ్యాయులే వారికి దిశ దెశ నిర్దేశం చేస్తూ తీర్చి దిద్దాలన్నారు. సమాజంలో విద్యకు మించిన ఆస్తి లేదన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠపుస్తకాలు, నోటు పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో స్టార్ కృష్ణతో పాటు స్థానిక నాయకులు బాలాజి నాయుడు, గోగినేని భాస్కర్‌నాయుడు, సుబ్రమణ్యం,మోహన్‌రెడ్డి, మోహన్‌నాయుడు, అల్లం మణి,పులి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం డ్రై డేతో వ్యాదులు దూరం : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 2 ప్రభాతవార్త : ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించడం ద్వారా విషజ్వరాలు, వ్యాదులు ప్రబలకుండా ఉంటాయని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జులై 1 నుండి జులై 31వ తేది వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తున్నం విషయం విధితమే. అందులో భాగంగా శుక్రవారం గిరిపురంలో నిర్వహిస్తున్న డ్రై కార్యక్రమాన్ని కమిషనర్ పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత, ఫ్రైడే డ్రైడే ద్వారా వ్యాధులు ఎలా అరికట్టవచ్చని ప్రజలకు కమిషనర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పరిసరాల పరిశుభ్రత, డ్రైడే వంటివి పాటించడం వలన డయేరియా, చికెన్ గున్యా, మలేరియా, డెంగ్యూ వంటి విష జ్వరాలు ధరించేరవని అన్నారు. దోమల లార్వా చనిపోతాయని అన్నారు. తద్వారా విష జ్వరాలు ప్రబలకుండా ఉంటాయని అన్నారు. అందువల్ల ప్రజలు వారంలో శుక్రవారం డ్రై డే పాటిస్తూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే తాగిన వాటర్ బాటిల్స్, టెంకాయ చిప్పలు, వినియోగించాలని ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, టైర్లు వంటివి ఇంటి పరిసరాల్లో ఉండకుండా, అందులో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతి రోజు కాచిన నీరు తాగడం మంచిది అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్స్ చెంచయ్య, ఆరోగ్యశాఖ సిబ్బంది మేస్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.48 లక్షల అక్రమ మద్యం ధ్వంసం

బంగారుపాళ్యం, ఆగస్టు 2 ప్రభాతవార్త: బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో 24 కేసుల్లో పట్టుబడిన 48 లక్షల రూపాయల విలువైన అక్రమ మద్యం, నాటు సారాను శుక్రవారం బంగారుపాళ్యం పోలీసులు మామిడి మార్కెట్ యార్డు ఆవరణలో జెసిబి వాహనంతో తొక్కించి ధ్వంసం చేశారు. బంగారుపాళ్యం పోలీసులు గత కొన్ని రోజులుగా అక్రమ మద్యం, నాటుసారాను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించి వారి నుండి పట్టుబడిన అక్రమ మద్యం, నాటుసారాను పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసి వుంచేవారు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్‌లో పెద్ద ఎత్తున అక్రమంగా పట్టుబడిన అక్రమ మద్యం, నాటు సారా నిండిపోవడంతో ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు బంగారుపాళ్యం ఇన్స్‌పెక్టర్ లక్ష్మయ్య, ఎస్ఇబి ఎఇఎస్ శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో పోలీసులు జెసిబితో ధ్వంసం చేశారు.

## క్రికెట్ స్టేడియంను అందుబాటులోకి తీసుకురండి: కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 2 ప్రభాతవార్త : నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గొల్లవానిగుంట వద్ద ఏర్పాటు చేస్తున్న క్రికెట్ స్టేడియంలో అన్ని పనులు పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోనికి తీసుకురావాలని కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ పరిధిలోని నాలుగు ప్రాంతాల్లో పున: ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్న అన్నా క్యాంటీన్లలో జరుగుతున్న పనులను శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. అలాగే కచ్చపి ఆడిటోరియం, ఇండోర్ స్టేడియం, గొల్లవానిగుంట వద్ద ఏర్పాటు చేస్తున్న క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్రీడాకారులకు అనుగుణంగా క్రికెట్ స్టేడియం లోనూ, ఇండోర్ స్టేడియంలో వసతులు కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కచ్చపి ఆడిటోరియంను పరిశీలించి కళాకారులు తమ ప్రదర్శనలు ఇచ్చేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. అందరికీ అందుబాటులో ఉండేలా ధరలు నిర్ణయించి నిర్వహణ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో నాలుగు చోట్ల ఏర్పాటు చేస్తున్న అన్నా క్యాంటీన్లలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించిన నాల్గవ తేది సాయంత్రానికి అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ మోహన్, స్మార్ట్ సిటి జనరల్ మేనేజర్ చంద్రమౌళి, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈలు మహేష్, శ్రావణి, రాజు, ఏఈకాం ప్రతినిధి బాలాజీ, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, తదితరులు ఉన్నారు.


**CHANGE OF NAME**

I,**ADLURI SYAMALA** (old Name), R/at 4-20, K.R.Kandriga V&P, Railway Kodur (M), Annamayya Dist.A.P. I have changed my name as **ADLURI SHYAMALLA** W/o ADLURI SUBBARAMARAJU (New Name)

**ANNAMACHARYA INSTITUTE OF TECHNOLOGY & SCIENCES:TIRUPATI**

**(AUTONOMOUS)**

**Venkatapuram(V), Karakambadi (P), Renigunta(M), Mangalam Road, Tirupati.**

**APEAPCET/ECET/ICET/PGECET COUNSELING CODE : AITT**

**(Accredited by NBA, New Delhi & NAAC in 'A' Grade, Bangalore)**

**ADMISSION NOTIFICATION FOR " Leftover NRI & Non-NRI Category -B Seats In B.Tech Programme" - 2024-25**

| B.Tech | EEE | ECE | CSE | CE | ME | AIDS | CIC | AIML | CSE (DS) | CS IT |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| Intake | 60 | 180 | 360 | 60 | 60 | 180 | 60 | 180 | 180 | 180 |
| Leftover NRI & Non- NRI Category - B seats | 18 | 54 | 108 | 18 | 18 | 54 | 18 | 54 | 54 | 54 |

**Admission application for Leftover NRI & Non- NRI Category - B seats in B.Tech for 2024-25 is available in the Admin office / College website. Last date to submit application is 05-08-2024 and shortlisted candidates will be called for the admission process on 06-08-2024. For further details Contact: 9701591084.**

**Date: 02-08-2024** **Sd/- PRINCIPAL**